నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

నిజామాబాద్-కామారెడ్డి

సోమవారం | మార్చి 17, 2025 | www.navatelangana.com

కాలువలకు కొనసాగుతున్న నీటివిడుదల

- నిలకడగా ఎస్సారెస్పీ నీటిమట్టం

నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్



ఎస్సారెస్పీ నుంచి కాలువలకు నీటి విడుదల కొనసాగుతోంది. కాగా ప్రాజెక్టులో నీటిమట్టం నిలకడగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1070.70 అడుగుల(24.515 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయంలో 1065.50 అడుగుల(16.684 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. కాగా కాకతీయ, లక్ష్మి కాలువలతో పాటు ఎత్తిపోతల పథకాలకు మొత్తంగా 8638 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది.

కరాటే పోటీలలో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-మెండోరా



హైదరాబాదులోని మూడవ జాతీయస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం నిర్వహించగా.. మెండోర్ మండల్ వెల్గటూర్ గ్రామంలోని లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ కి చెందిన 25 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచినట్టు కరస్పాండెంట్ ఎమ్‌డి అజ్మత్‌పాష తెలిపారు. వివిధ రాష్ట్రాల నుండి జిల్లాల నుండి దాదాపుగా 500 మంది కి పైగా పాల్గొనగా.. ఇందులో లిటిల్ ఫ్లవర్ హై స్కూల్, విద్యార్థులు అండర్-12 విభాగంలో 12, అండర్-10 విభాగంలో నలుగురు, అండర్-8 విభాగంలో ఇద్దరు బంగారు పతకం గెలుపొందగా.. అండర్-12లో 5గురు కాంస్య పతకం గెలుపొందినట్టు తెలిపారు. వీరికి తెలంగాణ జే కె ఎస్. చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఎండి పాషా, స్టేట్ జాయింట్ సెక్రెటరీ పసునూరి అవినాష్, నిజామాబాద్ డిస్టిక్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ జోగు శివాని చేతుల మీదుగా మెడల్స్ వేసి ప్రశంస పత్రాలు అందజేశారు.



ఖాళీబిందెలతో ఉన్న గ్రామస్తులు

కాలిపోయిన బోర్‌మోటార్‌లు
పగిలిన మిషన్ భగీరథ పైపులు

పెద్దగుల్లాలో తీవ్ర నీటి ఎద్దడి

- జీపీ బోరు మోటార్‌ల రిపేర్‌కు నిధుల లేమి
- అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని గ్రామస్తుల డిమాండ్

నవతెలంగాణ-జుక్కల్



పంట పొలాల బోరు నుంచి పైప్ కనెక్షన్ తీసుకుని నీటిని పట్టుకుంటున్న పలువురు

కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని పెద్దగుల్లా గ్రామంలో గత 15 రోజుల నుంచి తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. దీంతో గ్రామస్తులు నీటి కోసం ఇక్కట్లు పడుతున్నారు. జీపీకి సంబంధించిన నాలుగు బోర్లు ఉండగా.. వాటి మోటార్లు కాలిపోవడంతో నీరు రావడం లేదు. దీనికి తోడు మిషన్ భగీరథ నీటి సరఫరా సైతం నిలిచిపోవడంతో నీరు లేక స్నానం సైతం చేయలేకపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే..

అధికారుల లెక్కల ప్రకారం గ్రామంలో మూడు లక్షల నీటి సామర్థ్యం కలిగిన ఐదు వాటర్ ట్యాంకులు ఉన్నాయి. అందులో ఒక్క ట్యాంకుకు మాత్రమే మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తుంటారు. మిగతా నాలుగు ట్యాంకులకు గ్రామ పంచయతీకి సంబంధించిన బోర్ల నుండి నీటిని పంపింగ్ చేస్తుంటారు. ప్రస్తుతం గ్రామపంచాయతీకి చెందిన నాలుగు బోరుల మోటార్లు కాలిపోయాయి. నీరు లేకపోవడంతో మోటార్లు కాలిపోయాయి. మోటార్లను రిపేర్ చేయించి మరిన్ని పైపులు లోపలికి దించితే నీరు వచ్చే అవకాశం ఉంది. కానీ జీపీలో నిధులు లేవని సెక్రెటరీ నుంచి సమాధానం వస్తుంది. దీనికితోడు మెదక్ నుంచి వచ్చే మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో నీటి కష్టాలు మరింత తీవ్రతరం అయ్యాయి. ఇంత జరుగుతున్నా.. ప్రజాప్రతినిధులు కాని, అధికారులు కానీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నీరు లేక స్నానం కూడా చేయడం లేదని వాపోతున్నారు. నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఒక వైపు అధికారులు సమీక్షల్లో ఊదరగొ డుతున్నా.. నిధులు లేక నీటి సమస్యను తీర్చలేకపోతున్నారు. ఇప్పటినా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రామంలో నీటి ఎద్దడిని తీర్చి నీటి సరఫరా పునరుద్ధరణ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఇసుక రగడ

బాల్కొండ కాంగ్రెస్‌లో ఇసుక పంచాయితీ

- ఆ పార్టీ వాట్సప్ గ్రూప్ వేదికగా సునీల్‌రెడ్డి, అనిల్ గ్రూప్‌ల మధ్య మాటలయుద్ధం
- అగ్గిమీద గుగ్గిలమవుతున్న వైనం
- పార్టీకి నష్టం చేకూర్చే అవకాశం ఉన్నట్టు కార్యకర్తల అసహనం

నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్

బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో సునీల్‌రెడ్డి, ఈరవత్రి అనిల్ గ్రూప్‌ల మధ్య కొన్ని రోజులుగా గ్రూప్ తగాదాలు ఉన్న విషయం తెలిసింది. కాగా వీరి తగాదాల్లో 'ఇసుక' ఆజ్యం పోసింది. దీంతో గ్రూప్ తగాదాలు తారాస్థాయికి చేరాయి. ఆ పార్టీ వాట్సప్‌గ్రూప్‌లో ఒకరిని మించి మరొకరు దూషించుకుంటూ మెసెజ్‌లు పెడుతుండటం గమనార్హం. ఇండ్లు నిర్మించుకునే పేదలకు తక్కువ రేటుకు ఇసుక లభించేలా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపితే.. అనిల్, మానాలమోహన్‌రెడ్డి మాత్రం డీడీలు తీసుకోవాలని అధికారులను ఎగదోస్తున్నారంటూ సునీల్‌రెడ్డి కాంగ్రెస్ గ్రూప్‌లో పోస్టు చేశారు. దీంతో కార్యకర్తలు స్పందిస్తూ.. ఇసుక దందాకు తెరలేపి పార్టీలో చిచ్చుపెడుతున్నావంటూ సునీల్‌రెడ్డిపై ఫైర్ అవుతున్నారు. దూషణల పర్వం కొనసాగుతుండటంతో కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదులు వెళ్లినట్టు సమాచారం. వివరాల్లోకి వెళ్తే..

బాల్కొండ నియోజకవర్గంలో పలు చోట్ల చెరువులు, కాలువల నుంచి ఇసుకను అక్రమంగా తోడేస్తున్న విషయం విధితమే. ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. ఇసుక అక్రమ రవాణా ఆనవాయితీగా వస్తుంది. కాగా పేదలు ఇంటి నిర్మాణం కోసం స్థానికంగా లభించే ఇసుకను వే బిల్లుతో ఉచితంగా అందజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. దీంతో నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా కొత్త పుంతలు తొక్కుతోంది. పేదల ఇంటి నిర్మాణం పేరుతో యథేచ్ఛగా పరిమితికి మించి ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్టు భోగట్ట.

శత్రువులు ఎక్కడో లేరంటూ.. సునీల్‌రెడ్డి పోస్ట్

'ఈ గ్రూపులో అందరూ ముఖ్యమైన కాంగ్రెస్ పార్టీ నాయకులే ఉన్నారు. బాధాకరమైన హృదయంతో మీకు ఈ విషయం చెప్తున్నా.. శత్రువులు ఎక్కడో ఉండరు మన ఇంట్లోనే ఉంటారు. నా చేరిక అప్పటి నుండి ఎన్నికల నుండి చూస్తున్నా.. చెడగొట్టడమే వీళ్ల పని. చెడిపేయడమే వీళ్ల ఎజెండా. ముఖ్యమంత్రి ఆలోచన మేరకు ఉచితంగా తక్కువ ధరకు ఇసుకను ప్రజలకు అందించాలని కృషి చేస్తుంటే ప్రశాంత్ రెడ్డి అండ్ హిజ్ కంపెనీ అయినా టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్, మోహన్‌రెడ్డి.. ప్రజల నుండి డిడి డబ్బులు వసూలు చేయాలని అధికారుల మీదకి ఒత్తిడి తెస్తున్నారు. మాఫియా నడిచినప్పుడు ఎవరు పట్టించుకోలే కానీ ప్రజలకు లబ్ధి చేకూరుద్దాం అంటే మాత్రం వీళ్లకు ఎక్కడలేని ఆత్రం వస్తుంది. ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు లబ్ధి చేకూరుద్దామని ప్రయత్నిస్తే అడ్డుపుల్ల వేయడమే వీరికి పనిగా మారింది. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీని నన్ను మోసం చేశారు. ఇప్పుడు ప్రజలను కార్యకర్తలను మోసం చేయాలని చూస్తుండ్రు. మోసమే వీరి పని. మోసం చేయడమే వీరి ఆనవాయితీ. ఏది ఏమైనా నేను ప్రజల పక్షం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పక్షం' అంటూ సునీల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేశారు.

నీ రూపంలోనే పార్టీలో శత్రువులున్నారు : కార్యకర్తల పోస్ట్

ముత్యాల సునీల్‌రెడ్డి పెట్టిన పోస్టుపై అనిల్, మానాల గ్రూప్ కార్యకర్తలు పార్టీ వాట్సప్ గ్రూప్‌లో ఫైర్ అవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా.. లేకున్నా అనిల్, మానాల పార్టీని అంటిపెట్టుకొని ఉన్నారని, ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని చెబుతున్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక ఇస్తుంటే.. దాని పేరుతో ఇసుక దందాకు తెరలేపినట్టు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి శత్రువులు ఎక్కడో లేరని, నీ రూపంలోనే ఉన్నారని ధ్వజమెత్తుతున్నారు. ఇసుక పాయింట్‌ల వద్ద ఒక్క ట్రాక్టర్‌కు 500 నుంచి రూ.1000 చొప్పున, జేసీబీకి పదివేల చొప్పున రోజుకు వసూలు చేస్తున్నాడని, ఒక్క రోజు ఒక్క పాయింట్‌లో 200 ఇసుక ట్రాక్టర్‌లు ట్రిప్పులు కొడితే లక్ష రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారని, ఇలా నెలకు ఒక్క ఇసుక పాయింట్‌లోనే 30 నుంచి 40 లక్షలు వసూలు చేస్తున్నావని, ఇలా నియోజకవర్గంలో ఎన్ని ఇసుక పాయింట్‌లు నడుపుతూ ఎన్ని డబ్బులు దోపిడీ చేస్తున్నావో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్కువ ధరకు ప్రజలకు ఇసుక అందించాలంటే అర్థం నిన్ను ఇసుక దందా చేసుకొని డబ్బులు సంపాదించుకోమని కాదని వాట్సప్, ఫేస్‌బుక్ పేజీల్లో పోస్టులు పెడుతున్నారు. 'పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే పార్టీలో ఉన్నావని, కష్టకాలంలో ఉన్నప్పుడు ఎక్కడ ఉన్నావని ప్రశ్నిస్తున్నారు.



గ్రూప్ తగాదాలు మానండి : సామాన్య కార్యకర్తల మనోవేదన

కాగా గ్రూప్ తగాదాలతో అంతర్లీనంగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నష్టపో తుందని సామాన్య కార్యకర్త ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రూప్ తగాదాలు మాని పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని కోరుతున్నారు. కెఆర్ సురేష్ రెడ్డి బాల్కొండ నియోజకవర్గం నుంచి వెళ్లిన తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి ఇప్పటివరకు గెలవలేదని చెబుతున్నారు. తాము సుమారు 35 సంవత్సరాల నుండి కాంగ్రెస్ కార్యకర్తగా ఎవరికి టికెట్ వచ్చినా పార్టీ కే పనిచేస్తున్నామని, పది సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడింది ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు పని కల్పించుకుంటు వారీ సేవలను అటు పార్టీ కి ఇటు ప్రజలకు పెద్దలు ఉపయోగపడేలా వినియోగించుకోవాలని, కానీ కార్యకర్తలను విస్మరిస్తే ఎవరు గొప్ప నాయకుడు కాలేరని అంటున్నారు. ఒక నాయకుడికి పదవి వచ్చిందంటే ప్రతి కార్యకర్త శ్రమ కష్టం తోనే అని ఇకనైనా గ్రూప్ తగాదాలు మానాలని కోరుతున్నారు. కాగా గ్రూప్ తగాదాలపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు వెళ్లినట్టు సమాచారం.

జీపీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ కేసులో నలుగురి రిమాండ్

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ గ్రామపంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసిన కేసులో మొత్తం నలుగురిని రిమాండ్ చేసినట్టు ఎస్‌ఐ స్రవంతి ఆదివారం తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. దోమకొండకు చెందిన చింతల రవీందర్, మన్నే శ్యామ్‌రెడ్డి గ్రామపంచాయతీ పేరుతో నకిలీ రసీదు బుక్కులు, స్టాంపు పేపర్లు, రబ్బర్ స్టాంపులు కలిగి వాటిని విక్రయిస్తూ వచ్చారు. వాటిని స్వాధీనం చేసుకొని ఏ1, ఏ2పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కాగా ఆ పత్రాలతో మండల కేంద్రానికి చెందిన మంగళ పల్లి శ్రావణ్, తన పెద్దమ్మ మంగళపల్లి రాజమణి బంగారాన్ని పంచాయతీ కార్యదర్శి నకిలీ స్టాంపులు, పేపర్‌లు ఉపయోగించి కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఆమెకు తెలియకుండా కామారెడ్డిలోని ఓ బ్యాంకులో గోల్డ్‌లోన్ విడిపించి, ఆ బంగారం అతని పేరు మీద మార్పించినందుకు ఆయనను సైతం ఏ3గా రిమాండ్ చేసినట్టు తెలిపారు. కామారెడ్డి పట్టణ కేంద్రంలో శ్రీ కృష్ణ రబ్బర్ స్టాంప్ షాప్ యజమాని దోంతుల కృష్ణ నకిలీ స్టాంపులను తయారుచేసి విక్రయించి నందుకు ఏ4గా నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై స్రవంతి తెలిపారు.

గ్రామంలో ఎవరైతే కోర్టు కేసులలో, పోలీస్ కేసుల విషయంలో జామిని షూరిటీ పత్రాల కోసం తిరుగు తున్నారో వారిని గుర్తించి, వారి అవసరం అదునుగా భావించి వారికి కోర్టు జామిన్ షూరిటీ పత్రాలు సిద్ధం చేసి ఇస్తామని చెప్పి వారి నుంచి అధిక డబ్బులు వసూలు చేసి ఈ నకిలీ రసీదు బుక్కులను నకిలీ స్టాంపులను ఉపయోగించి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాలను ఫోర్జరీ చేసినట్టు గుర్తించినట్టు తెలిపారు.

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో
ఆశాలకు రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి

- ఆశాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్
- 19న ఆశా వర్కర్ల సమస్యలపై చలో కలెక్టరేట్ జయప్రదం చేద్దామని పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న నూర్జహాన్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ ఆశ వర్కర్లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19న ఆశా వర్కర్ల సమస్యలపై చలో కలెక్టరేట్ జయప్రదం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆశా వర్కర్ల విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. బిఆర్ఎస్ కంటే తమ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని, ఆశాలకు వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చింది. ఆశాల ఓట్లతో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చింది. కానీ ఆశాల సమస్యలు మాత్రం నేటికీ పరిష్కారం చేయలేదు. ఈ కాలంలో ఆశాలకు ఫిక్సిడ్ వేతనం రూ.18,000/- లు నిర్ణయం చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరంచాలని కోరుతూ జిల్లా ఉన్నతాధికారులకు మరియు జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేలకు, మంత్రులకు ఆశాలు అనేకసార్లు వినతిపత్రాల ద్వారా విజ్ఞప్తులు చేశారు. ఇప్పటికీ నిరంతరం నిరసనలు, పోరాటాలు నిర్వహిస్తున్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం చలనం లేనట్టు వ్యవహరిస్తున్నది. ఈ పరిస్థితిలో ఆశాల సమస్యల పరిష్కారం కోసం మార్చి 19 చలో కలెక్టరేట్ ఆశ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని' పిలుపునిచ్చారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం బడ్జెట్ సమావేశాలలో నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుకన్య , రేణుక, స్వప్న, రాధా, శోభ, గంగామణి, లలిత, తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో ఎమ్మెల్యే, కలెక్టర్ పర్యటన

- మంత్రితో కలిసి సాంగ్లీలో చెరుకు సాగు పరిశీలన



నవతెలంగాణ-బోధన్

మహారాష్ట్రలోని సాంగ్లీలో చెరుకు పంటల సాగును ఆదివారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సంబంధిత అధికారులు పరిశీలించారు. బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం తెరిపించడానికి గతంలో ప్రత్యేక కమిటీని వేసిన ప్రభుత్వం అందులో భాగంగా ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు మహారాష్ట్రలోని సాంగ్లీ ప్రాంతంలో శ్రీ దత్త షుగర్ ఫ్యాక్టరీని అక్కడి చెరుకు పంట సాగును పరిశీలించడానికి బోధన్ నియోజకవర్గంలోని కొందరు రైతులను వెంట తీసుకెళ్లారు.

కేసీఆర్‌తో రేవంత్ సరితూగరు

- రేవంత్‌రెడ్డి మాట్లాడితే ఏ సర్టిఫికెట్ తెచ్చుకొని వినాల్సిన దౌర్భాగ్య స్థితి
- తెలంగాణ హిస్టరీ, ఫ్యూచర్ కేసీఆరే : ఎమ్మెల్సీ కవిత ఫైర్
- బీఆర్ఎస్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న కవిత

తెలంగాణ హిస్టరీ, తెలంగాణ ఫ్యూచర్ రెండు కూడా బీఆర్ఎస్ అధినేత కేసీఆరే అని ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తానే తెలంగాణ ఫ్యూచర్ అని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేసీఆర్‌తో ఏ విషయంలోనూ సరితూగరు అని అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ఆదివారం నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... కెసిఆర్ అంటే ముఖ్యమంత్రి భయపడుతున్నారని, నిద్రలో కూడా కేసీఆర్ కేసీఆర్ అంటున్నారని అన్నారు. గౌరవ మర్యాదలు అనేటివి కొనుక్కుంటే వచ్చేవి కావని, మన నడవడిక, మాటతీరు, పని పేరు బట్టి ఉంటుందని చెప్పారు. కెసిఆర్ మాట్లాడితే ఏం మాట్లాడుతున్నారో అని ప్రజలు టీవీలను ఆన్ చేస్తారని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు టీవీని మ్యూట్ చేసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడితే ముందుగానే సెన్సార్ బోర్డు వద్దకు వెళ్లి ఏ సర్టిఫికెట్ తీసుకొని వినాల్సిన దౌర్భాగ్యం ఏర్పడిందని ఎద్దేవా చేశారు. రంజాన్ మాసంలో అబద్ధాలు చెప్పి తిట్లు తిని పాపాన్ని మూట కట్టుకోవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు. రంజాన్ తోఫాలు ఎందుకు నిలిపివేశారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రంజాన్ సమయంలో మసీదుల సుందరీకరణ కోసం బీఆర్ఎస్ హయాంలో ఒక్కో మసీదుకు రూ. లక్షా ఇచ్చే వాళ్లమని, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క మసీదుకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఇఫ్తార్ విందులో జిల్లా పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేష్ గుప్తా, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు, మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్, మాజీ మేయర్ నీతుకిరణ్, మాజీ ఎమ్మెల్యే షకీల్ గారి సతీమణి ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగి @ రాజకీయ పార్టీకి అధ్యక్షులు

- ఐడీసీఎంఎస్ ఉద్యోగి తీరు
- ఏ పార్టీ అధికారంలో ఉంటే దానికి వత్తాసు
- చర్యలకు వెనుకాడుతున్న ఉన్నతాధికారులు..?

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



పార్టీ రిజిస్ట్రేషన్ కోసం పేపర్‌లో పబ్లిక్ నోటీస్



ఫ్లెక్సీలో ఫొటో

ప్రభుత్వ ఉద్యోగులు.. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వాల లక్ష్యం చేరేలా విధులు నిర్వర్తిస్తుంటారు. వీరు రాజకీయ పార్టీలకు అతీతంగా తమ విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఏ రాజకీయ పార్టీలో సభ్యత్వం కాని, వాటితో అనుబంధం కానీ, వాటి ప్రచారాలు కొనసాగించొద్దు. కానీ జిల్లాలో ఐడీసీఎంఎస్‌లో ఓ ఉద్యోగి.. ఏకంగా ఓ రాజకీయ పార్టీని స్థాపించి.. దానికి రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. అటు పార్టీలో ఉంటూ ఇటు ఉద్యోగం చేస్తుండటం ఆలస్యంగా వెలుగుజూసింది. సదరు వ్యక్తి గతంలో ఉద్యోగం నుంచి సస్పెండ్ అయినట్టు సమాచారం. కానీ మళ్లీ తనకున్న రాజకీయ పలుకుబడితో తిరిగి ఉద్యోగంలో చేరినట్టు సమాచారం. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే..

సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్-1964 రూల్ నెం 5 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి ఏ రాజకీయ పార్టీలో సభ్యత్వం కాని, ప్రచారం చేయడం కాని, పార్టీకి సహాయం చేయడం నిషేధం. కానీ ఐడిసిఎంఎస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గడ్డం నర్సారెడ్డి.. 2022లో 'ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ'ని స్థాపించినట్టు సమాచారం. ఆ పార్టీకి రాష్ట్ర అధ్యక్షులుగా నర్సారెడ్డి కొనసాగుతున్నారు.

కాగా ఐడీసీఎంఎస్ చైర్మన్‌గా సంబారి మోహన్ ఉన్న సమయంలో ఉద్యోగస్తులు, రైతుల ఫిర్యాదుతో పాలకవర్గం సమా వేశంలో తీర్మానం చేసి ఆయనను ఉద్యోగంలో నుంచి తొలగించారు. కాగా 6 నెలల తరువాత తనకున్న పరిచయాలు, పలుకుబడితో ఓ రాజ్యసభ ఎంపీ సహాయంతో అప్పుడు జిల్లాలో పనిచేసిన డిసిఓ సింహాచలం ద్వారా మళ్లీ తిరిగి ఉద్యోగంలో చేరారు. ప్రస్తుతం ఆయన నెలకు 25 వేల రూపాయల వేతనం పొందుతున్నాడు. అటు ఉద్యోగం చేస్తూ అటు పార్టీ పనులను చక్కబెడుతున్నట్టు సమాచారం. అధికారంలో ఏ పార్టీ ఉంటే.. వారిని ప్రసన్నం చేసుకుంటూ తన పనులు చక్క బెట్టుకుంటున్నట్టు సమాచారం.

ఇంత జరుగుతున్నా.. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అనేక అనుమానాలు తావిస్తున్నాయి. వారికి సమాచారం లేక చర్యలు తీసుకోవడం లేదా.. లేకుంటే సదరు ఉద్యోగి పలుకుబడిని వినియోగించుకొని అధికారులను మ్యానేజ్ చేస్తున్నాడా అన్నది తెలియాల్సి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పన్ను చెల్లించండి.. నగరాభివృద్ధికి సహకరించండి



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ కార్పొరేషన్ ఆస్తిపన్ను చెల్లింపు చెయ్యాలని మున్సిపల్ శాఖ అధికారులు జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడలిల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నగర ప్రజలకుమనవి- ఆస్తి పన్ను, నీటి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ ఫీజు, యూజర్ చారీలు 31-03-2025 లోపు చెల్లించి నిజామాబాద్ నగరాభివృద్ధికి సహకరించగలరని, ఆర్థిక సంవత్సరం ముగింపు తేది 31-03-2025 నాటికి emancipal.telangana.gov.in పది అంకెల పిటిఐఎన్ ఎంటర్ చేయండని, సూచించే పద్ధతిలో చెల్లించండి.. లేదా మీ సేవ ద్వారా, సిటిజన్ బడ్డి యాప్ ద్వారా, నగరపాలక సంస్థ కార్యాలయంలో బిల్ కలెక్టర్ ద్వారా చెల్లించండని కమిషనర్ నగరపాలక సంస్థ అని అందులో రాసి ఉంది.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెద్దమ్మతల్లి ఆలయం వద్ద నూతన ఆలయ నిర్మాణానికి భూమి పూజ ముదిరాజ్ సంఘం పెద్ద మనుషుల సమక్షంలో వేద పండితులు బ్రహ్మశ్రీ వేదాంతం గోపికృష్ణ శర్మఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దమ్మ తల్లి ఆల కమిటీ చైర్మన్ గాజం మచ్చేందర్, పెద్ద బజార్ సంఘం అధ్యక్షులు బోండ్ల సంతోష్, రాజాంనగర్ సంఘ అధ్యక్షులు ఈర్ల రవి, చైర్మన్ బోన సుమన్, జక్కం ప్రసాద్, ముదిరాజ్ సంఘం కుల పెద్ద మనుషులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక నిల్వలకు నేడు బహిరంగ వేలం

నవతెలంగాణ-ఏర్గట్ల

ఈ నెల 17 వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు సొసైటీ గోదాం వద్ద బహిరంగ వేలం ఉంటుందని ఏర్గట్ల తహసీల్దార్ (ఎఫ్ఏసీ) విష్ణువర్ధన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తడపాకల్ గ్రామ శివా రు నందు సొసైటీ గోదాం వద్ద 40 ట్రాక్టర్ల అక్రమ ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకున్నామని, వాటికి వేలం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు రూ 5000 నగదు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

యువ న్యాయవాదికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కు చెందిన ఎం.సతీష్ న్యాయవాదిగా నియామకం కావడంతో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు బుచ్చన్న మాట్లాడుతూ మున్ముందు మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు చక్రధర్, మంచిర్యాల సురేష్ కుమార్, నూనె నరేష్, గణేష్, కత్రాజి గంగాధర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం

నవతెలంగాణ-ఆర్మూర్

శ్రీ సోమవంశియ సహస్రర్జున క్షత్రియ (పట్కరి/ఖత్రి) ప్రాంతీయ సమాజ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం హైదరాబాదులోని ఉప్పల్లో ఆదివారం క్షత్రియ భవన్ లో నిర్వహించారు. ఈ ప్రమాణ స్వీకారంలో తెలంగాణ ప్రాంత మేనేజింగ్ కమిటీ మెంబర్ గ ప్రమాణ స్వీకారం చేసినట్టు జెస్సు అనిల్ కుమార్ తెలిపారు.

అసెంబ్లీలో మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

- రిలేదీక్షల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు



రిలేదీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. పట్టణ కార్యాలయం ముందు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత చేయకుండా ఉద్యోగాల ఫలితాలను విడుదల చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం రిలే దీక్షలు కొనసాగించారు. ఈ దీక్ష కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి, టౌన్ ఇంచార్జ్ శ్యామ్ మాదిగ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు గత ఏడాది ఆగస్టు ఒకటో తేదీన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపైన రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు ఇస్తూ తీర్పునిచ్చింది. ఆ తరుణంలో నిండు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపైన మాట్లాడుతూ.. అప్పటికే విడుదలైన ఉద్యోగ నోటిఫికేషన్‌లలో ప్రత్యేక ఆర్డినెన్స్ తెచ్చి వర్గీకరణను అమలు చేస్తామన్నారని తెలిపారు. రాజ్యాంగబద్ధమైన శాసనసభలో మాట్లాడిన మాటలను నిలబెట్టుకోకుండా మాదిగలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఉద్యోగాల్లో వర్గీకరణ అమలు చేయకుండా ఫలితాలను విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మాదిగల పట్ల సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని, ఉంటే ఆయన మాటకు కట్టుబడి తక్షణమే గ్రూప్స్ నియామకాల ప్రక్రియను ఆపి వర్గీకరణ అమలు చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ దీక్షకు ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి మైలారం బాలు మాదిగ అమ్మ మైలారాం ఏల్లవ్వ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మైలారం రాము మాదిగ, మండల ప్రధాన కార్యదర్శి నుతూపల్లి సంతోష్ మాదిగ, మండల అధికార ప్రతినిది సుద్ధపల్లి గణేష్ మాదిగ ,సాట్లపల్లి మల్యన మాదిగ, సట్లపల్లి సుధాకర్ మాదిగ,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట్ సంతల వేలం..
తీరు మారేనా?

- రేపే మేకల, వారాంతపు సంతల వేలం పాట
- తెలంగాణలోనే అత్యధిక ఆదాయం గల సంత
- ఆదాయం ఘనం.. ప్రచారంలో నామమాత్రం
- గత ఏడాది నాటకీయ పరిణామాలతో వాయిదాల పర్వం
- కాంట్రాక్టర్‌కు కోట్లలో టర్నోవర్
- నిబంధనల కంటే నాలుగింతల వసూళ్లు
- సిండికేట్‌కే సై
- అధికారుల తీరు మారేనా..?



నవతెలంగాణ-నవీపేట్

తెలంగాణలోనే అతి పెద్దదైన అధిక ఆదాయం గల నవీపేట్ మేకల సంతతో పాటు వారాంతపు సంతల వేలం అధికారుల పాలనలోనైనా తీరు మారేనా అని స్థానికంగా ప్రశ్నించుకుంటున్నారు. నవీపేట్ గ్రామపంచాయతీలో 2025-26 సంవత్సరానికి మేకల, వారాంతపు సంతల వేలంతో పాటు సులబ్ కాంప్లెక్స్ నిర్వహణ వేలం ఈనెల 18న మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించుటకు ప్రకటన చేశారు. మేకల, వారంతపు సంతల వేలంలో పాల్గొనేవారు లక్ష రూపాయల డిపాజిట్, సులబ్ కాంప్లెక్స్‌కు 50 వేలు చెల్లించి పాల్గొనాలని కార్యదర్శి రవీందర్ నాయక్ ప్రకటించారు.

గతేడాది నాటకీయ పరిణామాలు...

గతేడాది మేకల వారాంతపు సంతల వేలంలో 100కు పైగా పాట దారులు పాల్గొనగా సిండికేటుగా మారి మూడుసార్లు అప్సెట్ ధర రాకుండా చేయడంతో నాటకీయ పరిణామాలతో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గ్రామపంచాయతీకే నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. కొన్ని రోజులు పంచాయతీ సిబ్బంది వసూలు చేయగా సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కార్యదర్శి లేఖ రాయడంతో తిరిగి డిపిఓ చివరి వేలం పాటదారులైన పాత కాపులకే అప్పగించారు.

కాంట్రాక్టర్‌కు కోట్లలో టర్నోవర్...

తెలంగాణలోని అతిపెద్ద మేకల సంత కావడంతో పది నుంచి 20 వేల మేకలు ప్రతి శనివారం సంతకు రాగా క్రయవిక్రయాలు జోరుగా సాగుతాయి. మేక, గొర్రెకు 10 రూపాయలు, ఆటో, ట్రాలీలకు 50 రూపాయలు, మధ్యతరహా వాహనాలకు 80 రూపాయలు, లారీలు, పెద్ద వాహనాలకు 150 రూపాయలు నిబంధనల ప్రకారం వసూలు చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్లు దౌర్జన్యంగా నాలుగింతలు వసూలు చేస్తున్నట్లు క్రయ, విక్రయదారులు ఆరోపిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది మాత్రం మామూలుగా తీసుకుంటుంది. దీంతో కాంట్రాక్టర్‌కు కోట్లలో ఆదాయం వస్తుండడంతో వేలం పాటదారులను మచ్చిక చేసుకుని సిండికేట్‌గా మారి పంచాయతీ ఆదాయానికి ఎగనామం పెట్టి దశాబ్ద కాలంగా గుత్తాధిపత్యం నిర్వహిస్తున్నారు. సిండికేట్ కారణంగా గ్రామ పంచాయతీకి లక్షల్లో ఆదాయం నష్టపోతున్నారు. కాబట్టి ఉన్నతాధికారులు ఈ ఏడాది పట్టించుకుని జిల్లాలోని తై బజార్ కాంట్రాక్టర్లతో జిల్లా కేంద్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రోత్సహిస్తే పంచాయతీకి గణనీయంగా ఆదాయం పెరుగుతుందని స్థానిక ప్రజలు కోరుతున్నాను.

అంగన్‌వాడీకి బడ్జెట్ పెరిగేనా?

- నేడు, రేపు సమ్మెలో అంగన్‌వాడీ టీచర్లు

నవతెలంగాణ-ఆర్మూర్

ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసే పిఎంశ్రీ పథకం, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా ఆపాలని అంగన్వాడీ ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. నేడు, రేపు రాష్ట్ర వ్యాప్త సమ్మెకు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ముందుండి పోరాటం చేస్తుంది. అంగన్వాడీ టీచర్స్ హెల్పెర్స్, మినీటీచర్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని వీటి కోసం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తగిన కేటాయింపులు పెంచాలని కోరుతున్నారు.

అనేక మన్ననలు పొందిన ఐసిడిఎస్ సేవలు..

దేశంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో సైతం ఐసిడిఎస్ ప్రారంభమై 50 సంవత్సరాలు అవుతుంది. ఈ కాలంలో ఐసిడిఎస్ సేవలు అనేక మన్ననలు పొందాయి. ఐసిడిఎస్ ను సంస్థాగతం చేయాలని ఇందులో పనిచేస్తున్న అంగన్వాడి టీచర్స్, వెల్ఫేర్లు లను పర్మినెంట్ చేయాలని సుప్రీంకోర్టు గుజరాత్ హైకోర్టు తీర్పులు ఇచ్చారు.

పీఎం శ్రీ పథకం కింద...

ఐసిడిఎస్ అంగన్వాడి కేంద్రాలకు పోటీగా మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలతో పీఎ శ్రీ పథకం కింద ప్రీ ప్రైమరీ (ఎలిమెంటరీ) కేంద్రాలను పలు జిల్లాలలో 56 కేంద్రాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేయడం జరుగుతుందని, మొబైల్ అంగన్వాడి సేవల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని తెస్తుందని, ఐసిడిఎస్ ం ప్రైవేటీకరణ చేయాలని చూస్తుందని, పేద ప్రజలతో పాటు అంగన్వాడి టీచర్స్ వెల్ పర్సు నష్టం కలిగించే ఈ నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించికోవాలని, 24 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత పోరాటాల సందర్భంగా ఇచ్చిన హామీలు, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కేటాయింపులు పెంచాలని సమ్మెబాట పట్టారు.

ప్రధాన డిమాండ్లు ఇవే...

ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసే పిఎం శ్రీ పథకాన్ని పూర్తిగా రద్దు చేయాలని, వేతనాలు ప్రతినెల 1వ తేదీన చెల్లించాలని, మొబైల్ అంగన్వాడి సెంటర్ లను రద్దుచేసి ఐసిడిఎస్ సేవలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీల ప్రకారం 18 వేల వేతనం పెంచాలని, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, మంత్రి సీతక్క ఇచ్చిన హామీ ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రెండు లక్షలు, హెల్పర్లలకు పెన్షన్, వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవోను వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రిటర్మెంట్ అయినా అంగన్వాడి టీచర్లు, హెల్పర్లకు ఎలాంటి షరతులు లేకుండా ఆసరా పెన్షన్ అమలు చేయాలని, ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, 24 రోజుల సమ్మె కాలం వేతనాలు వెంటనే చెల్లించాలని, 2017 నుంచి టిఏ డిఏ ఇంక్రిమెంట్లు ఇంచార్జ్ అలవెన్స్ బకాయిలు మొత్తం చెల్లించాలని, అంగన్వాడి ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని, ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచి బలోపేతం చేసి పక్కా భవనాలు, మౌలిక వసతులు కల్పించాలని, కారుణ్య నియామకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 24 రోజుల రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా అప్పటి ప్రభుత్వ పెద్దలు అధికారులు బెనిఫిట్స్ ను పెంచుతామని హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించారు ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో హామీ నెరవేరలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా తమ సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రాలు ఇవ్వడంతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గత సంవత్సరం జూన్ 7న ఐసిడిఎస్ డైరెక్టరేట్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ధర్నా లు సైతం చేపట్టగా, వారు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

జిల్లాలోని...

జిల్లాలో ఐదు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, రూరల్, భీంగల్ సిడిపిఓ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1500 అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయి. ప్రతి అంగన్వాడి కేంద్రంలో టీచర్లు, ఆయాలు పిల్లలకు బాలింతలకు గృహిణులకు సేవలు అందిస్తున్నారు. కాగా 65 సంవత్సరాలు నిండిన వారు పదవి విరమణ చేయాలని ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయాలు సుమారుగా 288, టీచర్లు 94 మంది రిటర్మెంట్ అయ్యారు.

అంగన్వాడీల కుటుంబాలను ఆదుకోవాలి
రమేష్ బాబు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు



ఎన్నో సంవత్సరా నుండి పనిచేస్తున్న అంగన్వాడి టీచర్లు, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. ఎందరో చిన్నారులకు సేవలు చేసి విద్యాబుద్ధులు నేర్పిన టీచర్లు, ఆయాలు ఉన్నారు. రిటర్మెంట్ బెన్ఫిట్స్‌తో పాటు, పెన్షన్ సౌకర్యాన్ని కల్పించి ఆదుకోవాలి.

హామీలను అమలు చేయాలి...
కుతాడి ఎల్లయ్య , సిపిఎం నాయకులు, ఆర్మూర్



ఎన్నికలకు ముందు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన 24 రోజుల సమ్మె సందర్భంగా అంగన్వాడి టీచర్లకు కనీస వేతనాలు అమలు చేయాలి. ఉద్యోగ భద్రత కల్పిస్తామని, పిఎఫ్ సౌకర్యాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి 15 నెలలు గడిచింది. వాటి అమలుకు చర్యలు చేపట్టాలి. ఐసిడిఎస్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి.

ఒకేసారి ఎన్నికలతో ప్రభుత్వాల మధ్య సమన్వయం

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారతదేశ అభివృద్ధి కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తీసుకుంటున్న ప్రాముఖ్యతగల సంస్కరణల్లో మరో చారిత్రాత్మకమైన నిర్ణయం "వన్ నేషన్.. వన్ ఎలక్షన్" అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన వన్ నేషన్ వన్ ఎలక్షన్ వర్క్ షాప్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఒకే దేశం ఒకే ఎన్నిక అమలయితే దేశానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. సంపద, వ్యయ నియంత్రణ ప్రతి ఎన్నిక కోసం ఖర్చయ్యే వేల కోట్ల ప్రజా ధనం ఆదా అవుతుందని అన్నారు. తరచూ జరిగే ఎన్నికల వల్ల పాలనా పనులు అంతరాయమవకుండా, ప్రభుత్వం అభివృద్ధిపై పూర్తిగా దృష్టి సారించగలదని తెలిపారు. వ్యవసాయ అభివృద్ధి, ప్రాజెక్టులకు ఊతం ఎన్నికల కోడ్ (ఎంసిసి) వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోకుండా వేగంగా అమలు చేయగలుగుతామని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఒకేసారి జరగడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం మెరుగుపడుతుందని అన్నారు. ఈ వర్క్ షాప్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారీ, జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ , బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి నారాయణ సహా పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేటీఆర్, జగదీష్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి



కంఠేశ్వర్: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఆర్మూర్‌లో...

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్/ ముప్కాల్/మోర్తాడ్/మాక్లూర్

దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అవమానించేలా మాట్లాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మాటలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, దానిని సమర్థించిన కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశంలో అసెంబ్లీ దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం నిజామాబాద్ ఎన్టీఆర్ చౌరస్తా వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు ఆధ్వర్యంలో కేటీఆర్, జగదీశ్ రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పది సంవత్సరాల కాలంలో కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ దళితులను, గిరిజనులను, బీసీలను అవమానిస్తూనే ముందుకు వెళ్లిందని అన్నారు. ప్రస్తుతం అసెంబ్లీలో కేటీఆర్ బరితెగించి తన ఎమ్మెల్యేలతో కలిసి దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వాక్యాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మున్ముందు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే గుణపాఠం చెప్తామని, దళితులు గిరిజనులు అంతు చూస్తారని హెచ్చరించారు. అధికారం పోయినప్పటినుండి కేటీఆర్ మాట్లాడుతున్న మాటలు అందరినీ అవమానించేలా ఉన్నాయని, బీఆర్ఎస్ శాసనసభ్యులు స్పీకర్‌ను అవమానించి మాట్లాడితే దానిని సమర్థించడం అనేది కెసిఆర్ నుండి వచ్చిన దొర అహంకారమేనని అన్నారు. రాబోయే కాలంలో దళితులు, గిరిజనులు మిమ్మల్ని మరింత పాతాళానికి తొక్కుతారని, వెంటనే స్పీకర్‌పై అనుచిత వాక్యాలు చేసిన జగదీష్ రెడ్డి దానిని సమర్థించిన కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని డైమండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డీ రాజారెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, మాజీ పీసీసీ కార్యదర్శి రాంభూపాల్,మాజీ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గోపి, రాష్ట్ర ఎన్ఎస్‌యుఐ ప్రధాన కార్యదర్శి వేణు రాజ్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు యాదగిరి, జిల్లా ఫిషెర్మన్ అధ్యక్షులు శ్రీనివాస్, నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు వినయ్, నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం

ఆర్మూర్ : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పట్టణ అధ్యక్షులు ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అయ్యప్ప శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దళితుల పట్ల, దళిత నాయకుల పట్ల, బిఆర్ఎస్ వైఖరిని ఖండిస్తూ బిఆర్ఎస్ పార్టీ, ఆ పార్టీ నాయకులు దళిత నాయకుల పట్ల మొన్న అసెంబ్లీలో స్పీకర్ ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి ఏక వచనంతో మాట్లాడి సభా మర్యాదను మంట గలిపారన్నారు. గతంలో ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ను అసెంబ్లీ నుంచి బర్తరఫ్ చేశారు. లోక్ సభ స్పీకర్ గా తెలంగాణ బిల్లు పాస్ చేసిన మీరా కుమార్ తెలంగాణకు వచ్చి కేసీఆర్ అపాయింట్మెంట్ అడిగితే ఇవ్వలేదని, నెరేళ్లకు వెళితే అరెస్ట్ చేశారని తెలిపారు. దళిత ముఖ్యమంత్రి చేస్తానని మోసం చేశారని, ఇలా అనేక రకాలుగా దళితులను మోసం చేశారని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లింగ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, డిసిసిబి డైరెక్టర్ వాసు, జిమ్మి, రవి, ఫయీం భాయ్, కొక్కెర భూమన్న, లింబద్రి, బబ్లూ, నారాయణ, ప్రవీణ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎస్సీ సెల్, బీసీ సెల్, మైనార్టీ అధ్యక్షులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్కాల్: తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి ఆధ్వర్యంలో జగదీష్ రెడ్డితో పాటు కేటీఆర్ దిష్టి బొమ్మను దహం చేశారు. అనంతరం మగ్గిడి ముత్యం రెడ్డి మాట్లాడుతూ నిండు అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అవమానపరిచేలా మాట్లాడడం సరైంది కాదన్నారు. ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి తన చేసిన వాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్ర ప్రజలే బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్ర్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్ : 63 బస్టాండ్ సమీపంలో సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. స్పీకర్‌ని అగౌరపరిచే విధంగా మాట్లాడడం సరికాదని, బహుజనుడైన స్పీకర్‌ను అవమానపరిచి మాట్లాడడం కేసిఆర్, బీఆర్ఎస్ పార్టీకి తగదని అన్నారు. ఎమ్మెల్యే సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ నాయకుడుగా ఉన్న దళితుడైన విక్రమార్కుని కూడా ఇలాగే అవమానపరిచారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలకు 56శాతం రిజర్వేషన్ కల్పించాలని శాసనసభల తీర్మానం చేస్తే దాన్ని కూడా హేళన చేసే విధంగా మాట్లాడారని అన్నారు. దళితులు, బడుగు బలహీన వర్గాల పట్ల మీకున్న వైఖరి మార్చుకోకపోతే రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్తారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు రాములు, ఎన్డీసీసీ డైరెక్టర్ మోత్కు భూమన్న, మండల యూత్ ప్రెసిడెంట్ మనోజ్, ఏం సి డైరెక్టర్ మహిపాల్, గిర్మాజి గోపి, జెడి చిన్న గంగారం, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగదీశ్వర్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం

మాక్లూర్ : మండలంలోని మానిక్ బండారు చౌరస్తా వద్ద గల 63వ జాతీయ రహదారిపై బీఅర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అసెంబ్లీలో చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలలో తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ పైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలు చేయడం, ఏకవచనంతో పలకడం సరైంది కాదన్నారు. ఆ వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకులు మనస్థాపంతో అసెంబ్లీలో మాట్లాడుతున్నారన్నారు. జగదీశ్వర్ రెడ్డి మీరు తక్షణమే స్పీకర్ గారికి క్షమాపణ చెప్పకపోతే రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులంతా మీ ఇండ్లను ముట్టడిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్వర రావు, మండల అధ్యక్షులు రవి ప్రకాశ్, మాక్లూర్ సొసైటీ చైర్మన్ అశోక్, జాఫర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్, ఆరిఫ్, పరశురాం, జైల్ సింగ్, ఆరిఫ్, సందీప్, చిన్న,నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆటోలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి.. బంగారం, వెండి వస్తువులు చోరీ

నవతెలంగాణ-నిజాంసాగర్

ఆటోలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బంగారం, వెండి వస్తువులను దోచుకున్న ఘటన శనివారం సాయంత్రం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. నిజాంసాగర్ ఎస్ఐ శివకుమార్ కథనం ప్రకారం.. కళ్హేర్ మండలం మారిడి గ్రామానికి చెందిన మ్యాతరి భూమవ్వ తన కూతురు ఇంట్లో పూజ ఉన్నదని అచ్చంపేట్ గ్రామానికి వస్తుండగా నిజాంసాగర్ బస్టాండ్ వద్ద అచ్చంపేట్ వెళ్లడానికి ఆటో కోసం ఎదురుచూస్తుంది. ఈ క్రమంలో ఒక ఆటో డ్రైవర్, మహిళ ఇద్దరు కలిసి భూమవ్వను అచ్చంపేట్‌కు తీసుకెళ్తానని చెప్పి ఆటోలో ఎక్కించుకొని ఆమెను నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. ఆమె దగ్గర ఉన్న రెండు తులాల బంగారు నగలు, 20 తులాల వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. భూమవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎంపిటిసి కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మోషన్‌పూర్ గ్రామానికి చెందిన ఉప్పల్వాయి మాజీ ఎంపిటిసి ఉమాదేవి భర్త దత్తాద్రి తండ్రి శివయ్య మరణించడంతో వారి కుటుంబాన్ని బిఆర్‌యస్ నాయకులు ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రవీందర్రావు, మాజీ మార్కెట్ కమిటీ సభ్యులు పడిగల శ్రీనివాస్, నాయకులు శ్యామ్, రాజేందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావు
- పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

నవతెలంగాణ-బిచ్కుంద/జుక్కల్

జుక్కల్ నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరైనట్టు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావు అన్నారు. ఆదివారం మండలంలోని గుండెకల్లూర్ గ్రామంలో జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. సి.సి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అలాగే నూతనంగా మంజూరైన ప్రభుత్వ చౌకధరల దుకాణాన్ని ప్రారంభించి లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. అనంతరం జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ.. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసి ఇస్తామని నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని అన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో విద్యా వైద్యంతో పాటు వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధర్పల్ గంగాధర్, పిసిసి డెలికేట్ విట్టల్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి మున్నూరు నాగనాథ్, మాజీ ఏఎంసీ చైర్మన్ నాగనాథ్ పటేల్, సీనియర్ నాయకులు రాజుపటేల్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే..

జుక్కల్ : జుక్కల్ మండల కేంద్రంలో జాతీయ ఉపాధి హామీ పథకంలోని కేంద్ర నిధులతో మంజూరైన సిసి రోడ్డు పనులను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు శనివారం స్థానిక నాయకులతో కలిసి సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ.. గ్రామాల్లో సిసి రోడ్లు వేయడం వలన గ్రామాలకు కళ వచ్చిందన్నారు. గత ప్రభుత్వంలో వేసిన రోడ్డు కన్నా తాము వేసే రోడ్లు బాగున్నాయని ఎక్కడ అవసరమైన సీసీ రోడ్డు వేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రాబోయే రోజులలో గ్రామాలలో సిసి రోడ్డు తప్ప మట్టి రోడ్డు కనిపించకుండా తమ వంతుగా ప్రభుత్వంతో మాట్లాడి కృషి చేస్తానని ఎమ్మెల్యే జుక్కల్ మండల ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సాయ గౌడ్, తుకారం, అంజయ్య సేట్, రాజులు సెట్, రాజు పటేల్, బాబు పటేల్ తదితరులు పాల్గొన్నారు.



బిచ్కుంద : లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

స్నానానికి వెళ్లి యువకుడు మృతి

నవతెలంగాణ-జుక్కల్



మృతి చెందిన ప్రకాష్

స్నానానికి వెళ్లి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని పెద్దగుల్లా గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దగుల్లా గ్రామానికి చెందిన దావడ ప్రకాష్ (30) శుక్రవారం హెూలీ పండుగను పురస్కరించుకుని మిత్రులతో కలిసి రంగులాడాడు. అనంతరం స్నానానికి గ్రామానికి చెందిన దేశముఖ్ తలాబ్‌కు వెళ్లాడు. స్నానానికి నీటిలో దిగిన తర్వాత బురదలో చిక్కుకోవడంతో ఎటూ కదల లేక శ్వాస ఆడక మృతిచెందాడు. ప్రకాష్ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గ్రామంలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో దేశ్ ముఖ్ తలాబ్‌లో శవమై తేలడంతో గుర్తించిన గ్రామస్తులు కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా చెరువు గట్టుపై బట్టలు, చెప్పులు గుర్తుపట్టి ప్రకాష్ మృతదేహంగా గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి విషయాన్ని వివరించారు. తమకు ఎవరి మీద అనుమానం లేదని కుటుంబీకులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సన్మానం



మున్సిపల్ చైర్‌పర్సన్‌ను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని రాజీవ్‌నగర్ డబుల్ బెడ్ రూమ్ పట్టాలు ఇచ్చేందుకు కృషి చేసిన తాజా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియను కాలనీవాసులు ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్నేండ్లుగా డబుల్ బెడ్రూంలో ఉంటున్న లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేయగా.. ఆ విషయాన్ని గడ్డం ఇందుప్రియ దృష్టికి రాగానే ఆ విషయాన్ని జిల్లా కలెక్టర్, ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలాదారులు మొహమ్మద్ షబ్బీర్ అలీకి తెలియజేశారు. వారి సహకారంతో డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు పట్టాలు ఇప్పించేందుకు, కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. అధికారులతో చర్చలు జరిపి 300ల మంది లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వడంతో డబుల్ బెడ్ రూమ్ కాలనీవాసులు తాజా మాజీ చైర్‌పర్సన్ ఇందుప్రియా చంద్రశేఖర్‌రెడ్డిని అభినందించి సన్మానం చేశారు. రాజీవ్‌నగర్ కాలనీలో స్పెషల్ డ్రైవ్ నీటి సమస్య, డ్రైనేజ్ సమస్య విద్యుత్ సమస్యను తీర్చడం పట్ల కాలనీవాసులు ఆనంద వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్ రూమ్ అధ్యక్షులు డి.రాజు, ఉపాధ్యక్షులు శానవాస్ ఖన్, మహిళ కమిటీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం



నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని ఆదిపరాశక్తి మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధికి లింగంపేట్, ఐలాపూర్ గ్రామాలకు చెందిన గంగపుత్ర సంఘం సభ్యులు ఆదివారం మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు 21 వేల విరాళాన్ని అందజేశారు. గ్రామ సమీపంలోని పెద్దవాగు వద్ద గల మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధికి దాతలు, స్వచ్ఛంద సంఘాలు, కుల సంఘాలు, యువజన సంఘాలు, వ్యాపారులు, అన్ని వర్గాల ప్రజలు విరాళాలు ఇస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్తడి పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు దురిశెట్టి అశోక్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు సాయిలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజు, ఆలయ కమిటీ సభ్యులు నారాగౌడ్, మారుతి, ఎల్లమయ్య, గంగారం, ఆగమయ్య, బాలయ్య, లక్ష్మణ్, రఫీకోద్దీన్, ఆలేకుం. గంగపుత్ర సంఘం సభ్యులు ఉన్నారు.

బడాపహాడ్‌లో భక్తుల నుంచి దోపిడీ

- అద్దె రూములకు డిమాండ్
- ఒక్క రోజుకు రూ.500-1000 వరకు..

నవతెలంగాణ-వర్ని

బాడపహాడ్‌లోని (పెద్దగుట్ట)లో అద్దె రూమ్‌లకు డిమాండ్ నెలకొంది. ఇదే అనువుగా యజమానులు ఒక్క రోజుకు రూ.500 నుంచి 1000 వరకు వసూలు చేస్తున్నారు.

బాబా షాదుల్లా హుసేన్ దర్గా వద్దకు వేసవి కాలంలో పక్క రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో మొక్కులు చెల్లించుకునేందుకు ప్రజలు వస్తుంటారు. వీరికి నీడ కోసం ప్రభుత్వం నిర్మాణం చేసిన ధర్మశాలలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. అయినా వీటిని వక్ఫ్ బోర్డు అధికారులు గాలికి వదిలేశారు. దీంతో స్థానికులు కొందరు రూమ్‌లు నిర్మాణం చేసుకున్నారు. భక్తుల అధిక సంఖ్యలో వచ్చే సరికి అదే అనువుగా చేసుకొని అద్దె రూమ్‌ల యాజమానులు భక్తుల నుంచి రూ.500 నుంచి 1000 వరకు తీసుకుంటున్నారని అంటున్నారు. వక్ఫ్ బోర్డు అధికారులు వీటిని పట్టించుకోకుండా స్థానికుల అద్దె రూమ్ యాజమాన్యానికి అనుకూలంగా ఉంటూ, భక్తుల నుంచి దోపిడీ జరిగేందుకు ఆస్కారం అవుతుందని భక్తుల నుంచి ఆరోపణలు.

చుట్టూ గ్రామాల వారికి అవకాశం ఇవ్వాలి..

జలాల్‌పూర్ గ్రామ పరిధిలో గల బడాపహాడ్‌లో ఉన్న అద్దె రూమ్‌ల నుంచి ఏడాదికి 3కోట్ల రూపాయలు ఆదాయం వస్తుంది. ఇది వక్ఫ్ బోర్డులకు చెందకుండా కేవలం దళారుల జేబులలో నింపుకొంటున్నారు. ఇది కాకుండా బడాపహాడ్ చుట్టూ ఉన్న గ్రామాల వారికీ అవకాశం ఇవ్వాలని గ్రామాల ప్రధాన వ్యక్తుల నుంచి వినికిడి. లేని పక్షంలో వక్ఫ్‌బోర్డుకు అద్దె కిరాయిలా ఆదాయం చెందాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



దళితుల పట్ల అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

- బీఆర్ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారు
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో పలుచోట్ల నిరసనలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

దళితుల పట్ల బీఆర్ఎస్ అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అసెంబ్లీలో దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఆయనకు మద్దతు తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు కేటీఆర్ శాసనసభ్యత్వాన్ని రద్దుచేసి చట్ట పరంగా వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పలుచోట్ల నిరసన చేపట్టారు.

కామారెడ్డి : మాజీ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ ఆదేశాల మేరకు కామారెడ్డి నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలలో జగదీశ్‌రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు కేటీఆర్‌ల దిష్టిబొమ్మను దహనం చేసినట్టు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కైలాస శ్రీనివాస్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీలో దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఆయనకు మద్దతు తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు కేటీఆర్ శాసనసభ్యత్వాన్ని రద్దుచేసి చట్ట పరంగా వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి పట్టణంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారిద్దరి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు పండ్ల రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, కామారెడ్డి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌడుగుల శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనే శ్రీనివాస్, బీసీ సెల్ అధ్యక్షులు పుట్నాల శ్రీనివాస్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు షేరు అంజద్, ప్రసాద్, రవి, పంపరి శ్రీనివాస్, కళ్ల గణేష్, జొన్నల నర్సింలు, మహేష్, నాయకులు సబ్బని శంకర్, లక్కపత్ని గంగాధర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ : మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అవమానకరంగా, అసభ్యకరంగా, అనుచిత వ్యాక్యాలు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డికి, కేటీఆర్ వత్తాసు పలకడం రాష్ట్ర ప్రజలు, దళిత సామాజిక వర్గాలు గమనిస్తున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మొదటి ముఖ్యమంత్రిగా, దళితుడిని చేస్తానని చెప్పి సామాజిక వర్గాలకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన, ఉప ముఖ్యమంత్రి రాజయ్యను అకారణంగా, మాజీ సీఎం కేసీఆర్ పదవి నుంచి తొలగించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సీతారాం మధు, నర్సారెడ్డి, రామస్వామి గౌడ్, నల్లపు శ్రీనివాస్, తాటిపల్లి శ్రీకాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు పోగుల సాయిలు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలతో భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు..

రామారెడ్డి : అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అసెంబ్లీలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసనగా మండల కేంద్రంలో మాజీమంత్రులు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌గౌడ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ స్పీకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు వెంటనే జగదీశ్వర్‌రెడ్డి బహిరంగంగా క్షమాపణకు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, ఏఎంసి డైరెక్టర్ ఎండి రావుఫ్, నాయకులు పిప్పిరి గణేష్, రంగు రవీందర్‌గౌడ్, అంబాయి ప్రసాద్, గంగరాజగౌడ్, బిపేట నర్సింలు, ఉమ్మెత్తల నరసవ్వ, చెన్నూరి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మద్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. స్పీకర్‌ను అగౌరవంగా మాట్లాడడం అనుచిత వ్యాఖ్యలు చేయడం జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడే మాటలు సరైనవి కావని అలాంటి వారి సభ్యత్వాన్ని రద్దు చేయడమే సముచితమని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సదాశివనగర్ : అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్ దళితుడు అయిన కారణంగా ఆయనను కించపరిచే విధంగా మాట్లాడి సభ మర్యాదలు మంట కలుపుతూ అవమానించిన సూర్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు గుంటకల్ల జగదీశ్‌రెడ్డి అవమానించినందుకు నిరసిస్తూ మండల కేంద్రంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి నియోజకవర్గం శాసనసభ్యులు మదనమోహన్ ఆదేశాల మేరకు జగదీశ్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ఈర్షద్, మండల అధ్యక్షులు సంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సంగ్య నాయక్, మాజీ వైస్ ఎంపీపీ గాదరి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి బీరయ్య, సీనియర్ నాయకులు రూపేందర్‌రెడ్డి, ఎస్సీ విభాగం నగర్ మండల జనరల్ సెక్రెటరీ జగ్గ బాలరాజ్, మైనార్టీ మండలాధ్యక్షులు సాధిక్ అలీ, యూత్ మండలాధ్యక్షులు అన్వేష్‌గౌడ్, గ్రామ అధ్యక్షులు చింధం రాజయ్య, సీనియర్ నాయకులు శ్రీనివాస్, పెసర సాయిలు, చిన్న మన రాజయ్య, శ్యాంబాబు, బెస్తలింగం తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను అంబేద్కర్ చౌరస్తా వద్ద దహనం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీయొద్దీన్, లింగంపేట్ పట్టణ అధ్యక్షులు ప్రసాద్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జొన్నల రాజు, మాజీ మండల అధ్యక్షుడు ఎల్లమయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ్ నాయక్, మండల యూత్ అధ్యక్షులు సుప్పల రాజు, లింగంపేట్ మాజీ ఎంపిటిసి ఏదుల్, మాజీ సోషల్ మీడియా కన్వీనర్ నగేష్ పాల్గొన్నారు.

బహిరంగ క్షమాపణ చెప్పాలి..

పెద్దకొడప్‌గల్ : రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను కాంగ్రెస్ మండల నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ స్పీకర్ దళితుడు అయినందునే ఉన్నతవర్గాల ఎమ్మెల్యేలు అతని పోడియంపై విరుచుకుపడి అగౌరవపర్చడం సరికాదన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిప్ప మోహన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, అక్కలి సాయిరెడ్డి, మల్లప్ప పటేల్, సంజీవ్, కల్లూరి పండరి, మొహిద్దిన్ పటేల్, సంతోష్ దేశాయ్, బస్వరాజ్ దేశాయ్, రషీద్, జిన్న రాములు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తీరుకు నిరసనగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు నాయకులు కావాలనే కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని సభ నడవకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో క్రమశిక్షణ సంఘం సభ్యులు రామచంద్రారెడ్డి, తాండూరు సొసైటీ అధ్యక్షుడు ఆకిడి గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ రాగూర్, మైనార్టీ అధ్యక్షుడు ఇమామ్, యూత్ అధ్యక్షుడు శ్రీరాం గౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సురేందర్ గౌడ్, కోఆర్డినేటర్ నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి : అసెంబ్లీ సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఏక వచనంతో అసెంబ్లీ నీ సొంతం కాదంటూ మాట్లాడి స్పీకర్ స్థానాన్ని అగౌరవపరిచిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి , ఎమ్మెల్యే కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను పాత బస్టాండ్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దహనం చేశారు. మూడు దఫాలుగా సూర్యాపేట ఎమ్మెల్యేగా గెలుపొంది సమావేశాల్లో మాట్లాడటం తెలియని జగదీశ్‌రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మహమ్మద్ చౌకత్ అలీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అగౌరవపరిచి మాట్లాడిన జగదీశ్‌రెడ్డికి వత్తాసు పలికిన కేటీ రామారావుల సభ్యత్వం రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు గైని శివాజీ, లక్ష్మణ చారి, సిహెచ్ రాజీవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అంబీర్ శ్యామ్ రావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బిబిపేట్ (కామారెడ్డి): స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా మండల కేంద్రంలో జగదీష్‌రెడ్డి, కేటీఆర్ దిష్టి బొమ్మలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సూతరి రమేష్ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షులు మాట్లాడుతూ.. అసెంబ్లీలో స్పీకర్ పట్ల ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఏక వచనంతో మాట్లాడి సభా మర్యాదను మంట గలిపారన్నారు. కార్యక్రమంలో భిక్కనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దోమకొండ: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



సదాశివనగర్‌లో...



నాగిరెడ్డిపేట్‌లో...



పెద్దకొడప్‌గల్: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



తాడ్వాయి: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉంచాలి

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అన్ని రకాల రికార్డులు సక్రమంగా నిర్వహించాలని గ్రంథాలయ కార్యదర్శికి సూచించారు. అన్ని రకాల పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి నరేష్ రెడ్డి పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న చైర్మన్

అనాథ వృద్ధాశ్రమ అధ్యక్షునికి సన్మానం

నవతెలంగాణ-వర్ని

మోస్రా మండలం చింతకుంట గ్రామంలో ఆదివారం నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో చింతకుంట అనాథ వృద్ధాశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు చింతకుంట మోహన్ ఏఎస్ఐ నుండి ఎస్ఐగా ప్రమోషన్ రావడంతో భీం ఆర్మీ జిల్లా అధ్యక్షులు డి శ్రీనివాస్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ విధుల్లో ఉన్నత స్థాయికి ఎదగడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.


మోహన్‌ను సన్మానిస్తున్న భీం ఆర్మీ అధ్యక్షులు

టార్గెట్ రీచ్ అయ్యేనా?

- మిగిలింది 15 రోజులే
- ఆస్తి పన్నుల వసూలు లక్ష్యం రూ.50 కోట్లు
- బకాయిలు కలుపుకొని రూ. 89 కోట్లు
- వసూలైనవి సుమారు రూ.31 కోట్లు మాత్రమే
- పన్నుల బకాయిల్లో బడాబాబులు, పాత బకాయిలే అధికం
- పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేక టీంలు
- టాక్సులు చెల్లించకపోతే చర్యలు తప్పవు
- నిజామాబాద్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్


నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పన్నుల వసూలుకు ఈ సంవత్సరం ఇంకా పక్షం రోజులు మాత్రమే సమయం ఉంది. నిజామాబాద్ నగర కార్పొరేషన్‌కు సంబంధించి 2024 -25 ఆర్థిక సంవత్సరానికి 89 కోట్ల రూపాయలు ఆన్లైన్ డిమాండ్ ఉండగా దాదాపు రూ.50కోట్ల పన్నుల వసూళ్ల లక్ష్యంగా పెట్టుకుంది. మున్సిపల్ అధికారులు ఇప్పటి వరకు సుమారు రూ.31 కోట్లు మాత్రమే వసూలు చేశారు. గత సంవత్సరం సుమారుగా 39 కోట్ల వరకు వసూలు చేయగా ఇంకా 45 కోట్లు తేవాలని అనుకున్నారు. ఈ సంవత్సరం 50 కోట్లు లక్షం పెట్టుకోగా ఇంకా రూ.19 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఈ నెలలో నగర పాలక సంస్థ ఎట్టి పరిస్థితులలో లక్ష్యాన్ని పూర్తి చేసే దిశగా ముందుకు వెళ్తోంది. పన్నుల వసూళ్ల బకాయిలలో బడాబాబులు, చాలావరకు పాతవి రోడ్డు వైండింగ్‌లో పోయినవి, ఖాళీ స్థలాలు, బిల్డింగులు, రెసిడెన్షియల్ బిల్డింగులు, కమర్షియల్ బిల్డింగులు అధికంగా ఉన్నాయి. వాటికి సంబంధించిన వివరాలతో యజమానులు ఎవరు కూడా రిపోర్ట్ చేయకుండా వదిలివేసినవిగా ఉన్నవి మాత్రమే. వీరి నుంచి సుమారు 15 కోట్ల వరకు రావాల్సి ఉంది. 89 కోట్లలో 20 కోట్ల వరకు పెనాల్టీలుగా ఉన్నాయి.

ఆర్థిక సంవత్సరం పూర్తి కావడానికి ఇంకా 15 రోజులు మాత్రమే ఉంది. నిజామాబాద్ మున్సిపల్ పరిధిలో ఇప్పటి వరకు పన్నుల వసూలు అనుకున్న లక్ష్యంలో సుమారు 65 శాతం మాత్రమే పూర్తి చేశారు. పన్నుల వసూళ్లమాత్రం లక్ష్యానికి చేరుకోవడం లేదు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబం ధించి కార్పొరేషన్ పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.50 కోట్లు కాగా ఇప్పటి వరకు సుమారు రూ31 కోట్ల మేరకు మాత్రమే వసూలయ్యాయి. పన్నుల బకాయిలలో ఎక్కువమంది బడా బాబులు ఉండగా పాతవి రోడ్డులో పోయినవి ఖాళీ స్థలాలు, బిల్డింగులు, రెసిడెన్షియల్ బిల్డింగ్‌లు, కమర్షియల్ బిల్డింగ్లు అధికంగానే ఉన్నాయి.

పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేక టీంలు ఏర్పాటు...

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60డివిజన్లో పన్నుల వసూళ్ల కోసం డివిజన్లో ఒక్కొక్క డివిజన్ కి ఒక్కొక్క టీం ను ఏర్పాటు చేశారు. ఈ టీంలో ఉన్నవారు డివిజన్ల పరిధిలో సుమారు 25 వేల లోపు ఉన్న మున్సిపల్ బకాయిలను వసూలు చేస్తారు. జోన్లవారీగా ప్రత్యేక టీమ్లను ఏర్పాటు చేయగా జోన్ల వారిగా 25 వేలపైన ఉన్న టాక్స్ బకాయిలను వసూలు చేస్తారు. జోన్లవారీగా మొత్తం ఐదు జోన్లకు టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం, రెవిన్యూ విభాగం, శానిటేషన్ విభాగంలతోపాటు డి ఈ లు, ఏఈలు, టిపిఎస్‌లు, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పన్నులు వసూలు చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులు కలిసి నగరంలోని పలు ప్రాంతాలలో గల ఆస్తి పన్ను చెల్లించని దుకాణదారులు, కళాశాలు, ఆసుపత్రులకు, హెూటళ్లకు సైతం నోటీసులు అందజేసి తక్షణమే పన్నులు చెల్లించాలని సూచించారు. లక్ష్యం పూర్తవుతుందా లేదా వేచి చూడాల్సిన పరిస్థితి నిజామాబాద్ మున్సిపల్ పరిధిలో నెలకొంది. అందుకు అనుగుణంగా మున్సిపల్ అధికార యంత్రాంగం సైతం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి. కఠినంగా వ్యవహరిస్తారా లేదా చూసి చూడనట్టు వదిలేస్తారా... ఆస్తి పన్నులు చెల్లించడంలో స్థానిక ప్రజలు నిర్లక్ష్యం, పన్నులు వసూలు చేయడంలో మున్సిపల్ శాఖ అధికారులు ప్రదర్శిస్తున్న తీరు కారణంగా ఎన్నో సంవత్సరాలుగా మున్సిపల్‌కు రావలసిన ట్యాక్స్ బకాయిలు పేరుకుపోయాయి. 89 కోట్లు బకాయిలు రావాల్సి ఉందని సంబంధిత శాఖ అధికారులు తెలుపుతున్నారు. ప్రతి సంవత్సరం వసూలు చేయాల్సిన ఆస్తి పన్ను విషయంలో అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణ జనాలనుండి మాత్రం ముక్కుపిండి ఆస్తిపన్ను వసూలు చేస్తున్న అధికారులు, పెద్ద పెద్ద వ్యాపారులు, రాజకీయ నాయకులు, స్టార్ హెూటళ్లు, ఫంక్షన్ హాల్స్, సినిమా థియేటర్స్, హాస్పిటల్స్, కార్పొరేట్ సంస్థలు, ప్రజాప్రతినిధుల విషయంలో మాత్రం పోనిలే అని వదిలేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇలా వదిలేయడంతో ఒక్కో బడా వ్యాపార సంస్థ 3 సంవత్సరాలుగా ఆస్తి పన్నులు చెల్లించకుండా ఉన్నారని తెలుస్తోంది. ఈ విషయంలో మున్సిపల్ శాఖ అధికారులు తూతూ మంత్రంగానే నోటీసులు జారీ చేస్తున్నారని ఆరోపణలు సైతం ఉన్నాయి. సాధారణ ప్రజల వద్ద ముక్కు పిండి ఎలా వసూలు చేస్తున్నారు కానీ బడా బాబులతో పాటు ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, కమర్షియల్ బిల్డింగులు, తదితరులకు సమయం ఇస్తున్న పెండింగ్లో ఉంటున్నట్లు సమాచారం.




పన్నులు వసూలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

ప్రతి ఒక్కరూ ఆస్తిపన్ను చెల్లించాలి

నిజామాబాద్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని 60 డివిజన్లో ప్రజలు మున్సిపల్ సిబ్బందికి ఆస్తి పన్ను చెల్లింపు విషయంలో ప్రజలు సహకరించాలి. ప్రతి ఒక్కరూ ఆస్తి పన్ను తమ బాధ్యతగా చెల్లించాలి. ఇందులో ఎవరిని ఉపేక్షించేది లేదు. నిజామాబాద్ మున్సిపల్ పరిధిలో పేరుకుపోయిన ఆస్తి పన్నుల విషయంలో ఎవరిని కూడా ఉపేక్షించకుండా బకాయిలు పెండింగ్లో అధిక మొత్తంలో ఉన్నవారికి నోటీసులు జారీ చేస్తున్నాం. నోటీసులు జారీ చేయడమే కాకుండా సరైన సమయానికి బకాయిలు చెల్లించకపోతే అవసరమైతే దుకాణాలను సీజ్ చేస్తాం. దుకాణాలే కాకుండా ఆస్తి పన్ను బకాయిలు ఉన్న వాటన్నిటికీ ఇదే పరిస్థితి ఉంటుంది. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా టాక్సు చెల్లించాలి. మంచినీటి నల్ల బకాయిలు సైతం పెండింగ్లో ఉన్నాయి. మంచినీటి కులాయి కనెక్షన్స్ తీసుకున్న ప్రతి ఒక్కరూ చెల్లించాలి. ఆస్తిపన్ను విషయంలో గానీ, మున్సిపల్ నల్లల విషయంలో గాని ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా మున్సిపల్ కార్యాలయానికి విచ్చేసి మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రజల సౌకర్యార్థం అందుబాటులో ఉంటాం.

కలిగోట్‌లో జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలం లోని కలిగోట్ గ్రామంలో జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. కలిగోట్ గ్రామంలో జవహర్ నవోదయ పాఠశాల కు కేటాయించిన స్థలాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సంద ర్భంగా దినేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే భూపతి రెడ్డి నవోదయ పాఠశాల ఇక్కడ ఏర్పాటు అయ్యే విధంగా చొరవ తీసుకోవాలని అన్నారు. ఎందుకంటే అన్ని విధాల సౌకర్యవంతంగా ఉన్న ఈ ప్రాంతం నవోదయ పాఠశాలకు ఎంతో అనువైనదని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ యువకులు వీడిసి సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎలాగైనా నవోదయ పాఠశాల కలిగోట్ గ్రామానికి వచ్చేలా కృషి చేయాలని ఎంపీ, జిల్లా అధ్యక్షుడు దినేష్‌ను కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ పద్మా రెడ్డి, నరేష్ యాదవ్, మండల అధ్యక్షులు కన్నెపల్లి ప్రసాద్, జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షులు తిరుపతి రెడ్డి, మహేందర్, దత్తు గౌడ్, శ్యామ్ రెడ్డి, విక్రమ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దినేష్‌కులాచారి

తపస్విలో హెల్త్ క్యాంపు


క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి తపస్వి స్వచ్ఛంద సేవా సంస్థలో లైఫ్ హాస్పటల్ ఎండి. డాక్టర్ భాను రామగిరి ఆధ్వర్యంలో ఆదివారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. చిన్నారులంద రికీ ఆరోగ్య పరీక్షలు చేసి మెడిసిన్స్ అందించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, తపస్వి చిన్నారులు పాల్గొన్నారు.

మొరం తవ్వితే అనుమతి తీసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మొరం తవ్వితే అనుమతి తీసుకోవవాలని నిజామాబాద్ రూరల్ శాసన సభ్యులు డాక్టర్ భూపతిరరెడ్డి ఆదివారం తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు, కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ అధ్యక్షులు, నాయకులు మీమీ గ్రామాల్లో కొత్తగా కట్టుకునే ఇండ్లకు గాని, ఇతర అవసరాలకు కావలసిన ఇసుక, మొరం కోసం ముందుగా సంబందిత తహసీల్దార్ల నుండి ఇందుకు ఉపయోగించే వాహనాల నెంబర్ లతో అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. లేకుంటే అధికారులకు ఫిర్యాదు వస్తే ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ముందస్తు అనుమతి తీసుకోవాలని నాయకులు అవగాహన ఉండాలన్ది కార్యకర్తలకు, నాయకులకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మహిళ ప్రాంగణం వద్ద ఘటన

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని జాతీయ రహదారి 44 పెర్కిట్ మహిళ ప్రాంగణం వద్ద శనివారం రాత్రి కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుండి ఢీకొనగా కారులో ఉన్న వారికి కూడా గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- పట్టుకుని కౌన్సిలింగ్ చేసిన పోలీసులు

నవతెలంగాణ-నవీపేట్

పోలీస్ స్టేషన్ పరిధిలోని యంచ గోదావరిలో నిజామాబాద్ నగరంలోని శివాజీ నగర్‌కి చెందిన భయ్యాని వంశీకృష్ణ అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు యువకుడిని పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. తరచూ యంచ గోదావరిలో ఆత్మహత్యలు జరుగుతున్నాయని నియంత్రణకు పోలీస్ శాఖ కృషి చేస్తుందని ఎస్ఐ వినయ్ కుమార్ తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా చేయాలి

నవతెలంగాణ-భీంగల్ రూరల్

భీంగల్ పట్టణంలోని యోగ సభ్యుల ఆధ్వర్యంలో చొక్కయగుట్టపై ఆదివారం గిరిప్రదక్షిణ చేశారు. తదనంతరం అయ్యప్ప ఆలయంలోని యోగ ఆసనాలు, ధ్యానం, భక్తి పాటలతో నృత్యాలు, చేసి అమృత ఆహారం భుజించారు. భీమ్ గల్ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ప్రతిరోజూ ఉదయం యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా యోగ గురువు అనంతరావు మాట్లాడుతూ... ప్రతి రోజు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, రకరకాల రోగాలకు యోగాతో పరిష్కారం పొందావచ్చని తెలిపారు. యోగలో భాగంగా ఆదివారం చొక్కయ్య గుట్ట పై గిరి ప్రదక్షిణ చేసినట్టు చెప్పారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ యోగ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో 100 మందిపైగా యోగ సభ్యులు పాల్గొన్నారు. చొక్కయ్య గుట్ట పై గిరి ప్రదర్శనలో జేజే నరసయ్య, శివ, రమేష్ పురస్తు లింబాద్రి, రాకేష్, భూపాల్, శ్రీనివాస్, పాల్గొన్న యోగ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

18న నడిపల్లి తైబజార్ వేలం

- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ఎంపీడీవో, కార్యదర్శి సూచన

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మండలంలోని నడిపల్లి మేజర్ గ్రామపంచాయతీకి సంబంధించిన తైబజార్ వేలం ఈనెల 18న నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీనివాస్ గౌడ్, మేజర్ గ్రామ పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి కార్యదర్శి నిట్టు కిషన్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ తైబజార్ వేలం పాట వర్తిస్తుందని వారు పేర్కొన్నారు. 18న ఉదయం 10 గంటలకు నడిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలంపాట ప్రారంభమవుతుందని వారు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ప్రభుత్వ నిబంధనలను పాటించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు 50 వేల రూపాయలు ముందుగా గ్రామ పంచాయతీలో డిపాజిట్‌గా చెల్లించి రశీదు పొందాలని సూచించారు. డిపాజిట్ చెల్లించిన వారికి మాత్రమే వేలంలో పాల్గొనడానికి అనుమతించ బడుతుందని పేర్కొన్నారు. గతేడాది కౌలు బకాయిలు ఉంటే పంచాయతీకి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పంచాయతీలో ఎలాంటి బకాయిలుఉన్నా వేలం పాటలో పాల్గొన వద్దని, లక్ష రూపాయల ఆస్తి, ధ్రువ పత్రం సంబందిత పంచాయతీల నుండి, కార్యదర్శుల సంతకంతో జారీ చేయబడి ఉండాలని పేర్కొన్నారు. యజమాని సంతకం ఉంటేనే అంగీకరించ బడుతుందని వివరించారు. వేలం దక్కించుకున్న వారు చెల్లించిన డిపాజిట్, ధరావత్తు కలుపుకొని నాలుగో వంతు చెల్లించాలని వివరించారు. వేలంలో కనీస ధర రాని పక్షంలో రద్దు పరచే అధికారం గ్రామ పంచాయతీకి ఉందని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ గ్రామ పంచాయతీ ఆమోదించబడిన రేట్లను మాత్రమే వసూలు చేయవల్సి ఉంటుందని, అంతకు మించి వసూలు చేస్తే వేలంను రద్దు చేస్తామని తెలిపారు. వేలం పాడుకున్నవారు ఏదైన కారణాలతో నెలసరి వాయిదాలు చెల్లించకపోతే వేలం హక్కులు రద్దు చేసి తిరిగి వేలం వేసే అధికారం పంచాయతీకి ఉందని పేర్కొన్నారు. రెండవ వేలం ద్వారా వచ్చిన నష్టాన్ని మొదటి వేలం పొందిన వ్యక్తి నుండి వసూలు చేయబడుతుందని వివరించారు.

డబ్బులకోసం కన్న తండ్రిని కడతేర్చిన కొడుకు

- సహకరించిన తల్లి
- 3 లక్షల అప్పునకు భూమి అమ్మాలని కొడుకు పట్టు
- కుదరదనడంతో హత్య
- పోలీసుల అదుపులో తల్లీకుమారుడు

నవతెలంగాణ - ధర్పల్లి



మానవ సంబంధ బాంధవ్యాలు మంటగలుస్తున్నాయి. డబ్బుల కోసం ఎంతకైనా తెగిస్తున్న ఘటనలు చోటుచేసు కుంటున్నాయి. మండలంలోని హెూన్నజీపేట్ గ్రామంలో శనివారం రాత్రి ఓ కుటుంబంలో డబ్బుల కొరకు జరిగిన గొడవలో తండ్రిని ఓ కుమారుడు తనతల్లి సహకారంతో కడతేర్చాడు. దీనికి కట్టుకున్న భార్యనే కనీసం వృద్ధుడని కనికరించకపోగా సహకరించి పొట్టన పెట్టుకున్నారు. చివరికి తల్లి కొడుకులిద్దరు జైలు పాలయ్యారు. గ్రామస్థులు, పోలీసుల వివరాల ప్రకారం.. హెూన్నజీపేట గ్రామానికి చెందిన పాలెం నడిపి మల్లయ్య (60) పాలెం లక్ష్మీ లకు ఒక కూతురు, ఒక కుమారుడు, కూతురికి పెళ్లి అయింది. మల్లయ్య పశువుల కాపరిగా పనులు చేసుకోగా భార్య వారికి ఉన్న వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగించేవారు. కాగా కొడుకు పని పాట లేక జులయిగా తిరిగేవాడని తెలిసింది. కొన్ని రోజులక్రితం మృతుని మనమరాలు ఆరోగ్యం బాగాలేక పోవడంతో సుమారు 3 లక్షల అప్పు అయినట్లు తెలిసింది. అప్పటినుండి కొడుకు భూమి అమ్మాలని తండ్రితో గొడవ పడేవాడని, ఇందులో భాగంగానే శనివారం పొద్దుపోయాక తన తండ్రి బెల్టు షాపులో ఆవరణలో ఉంటాడని అక్కడి వెళ్లాడు. గొడవ పెట్టుకోలానే ఉద్దేశంతో తాను మద్యం సీసా తీసుకొని తండ్రి ఎదుటే కూర్చుండి మద్యం సేవించినట్లు తెలిసింది. దీంతో అక్కడే తండ్రి కొడుకుల మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. దీంతో కోపంతో బెల్టు షాప్ లో నుండి మరో బీరు కొనుగోలు చేసి అక్కడే ఉన్న డ్రైనేజిలో మద్యాన్ని పారబోసి ఇంటికైతే రా ఈరోజు చంపేస్తా నంటూ అగ్రహంతో కొడుకు ఇంటికి వెళ్ళిపోయినట్లు తెలిసింది. వృద్ధుడు రాత్రి ఇంటికి వెళ్లగా తల్లి కొడుకు కలిసి భూమి అమ్మాలని మళ్ళీ గొడవ పెట్టుకోగా అప్పుయితే ఏదైనా కాయ కష్టం చేసి తీర్చుకుందాం.. నీకు ఆడపిల్లలున్నారు.. వాళ్ళ పెళ్లిళ్లకు అవసరం అవుతది.. భూమి అమ్మనివ్వనని తండ్రి చెప్పగా ఆవేశంతో కొడుకు, భార్య కలిసి కొట్టగా కింద పడిపోగా వృద్ధున్ని భార్య పట్టుకోగ కొడుకు బీరు సీసాతో బలంగా తలపై బాదడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలినట్లు తెలిసింది. కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టు మార్టంకోసం జిల్లాకేంద్రాసుపత్రికి తరలించి, హత్య చేసిన కుమారుడు మధు, సహకరించిన భార్య లక్ష్మీకు అదుపులో తీసుకొని రిమాండ్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

చదువుతోపాటు ఆటల్లో రాణించాలి

నవతెలంగాణ-మోర్తాడ్

విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో రాణించాలని మండల విద్యాశాఖ అధికారి సమ్మిరెడ్డి అన్నారు. మోర్తాడ్‌లోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ పాఠశాల మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పతి విద్యార్థికి చదువు ఎంత ముఖ్యమో వాటితోపాటు శారీరక ఆరోగ్యం కోసం ఆటపాటలు కూడా అంతే ముఖ్యమని అన్నారు. చిన్నతనంలోనే లక్ష్యసాధన దిశగా విద్యార్థులు ముందడుగు వేయాలని, ఆ దిశగానే విద్యాభ్యాసాలను కొనసాగిస్తూ తమ తల్లిదండ్రుల పేర్లను గుర్తింపు తెచ్చేలా విద్య అభ్యాసాలను కొనసాగించాలని అన్నారు. విద్యార్థులను నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులుగా ఓంకార్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అసోసియేషన్ భీంగల్ మండల అధ్యక్షులుగా సున్నపు ఓంకార్ ఎన్నికయ్యారు. ఆదివారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా కొండ్ర విజయ, బాలమణి, కార్యదర్శిగా బి. విశ్వనాథం, కోశాధికారిగా పతాని నవీన్, సహాయ కార్యదర్శులుగా మధు, మనోహర్, సలహాదారులుగా గుర్రం చిన్న రాజన్న, పోషన్న ప్రవీణ్, రఘు, పోసాని, చెప్పాల లక్ష్మిని ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గం కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ముందుండి పని చేస్తుందని తెలిపారు. అధ్యక్షులు ఓంకార్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.


ఎన్నికైన మున్సిపల్ యూనియన్ కార్యవర్గం

నృత్య తరగతులు ప్రారంభం

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని పోచమ్మ గల్లీలో గల శ్రీకృష్ణ దేవాలయంలో నాట్య గురువు డాక్టర్ భాశెట్టి మృణాళిని ఆధ్వర్యంలో చిన్నారులకు నృత్య తరగతులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాట్య గురువు మాట్లాడుతూ సోమవారం, మంగళవారం, బుధవారం తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు సంప్రదించాలని కోరారు. ఆంధ్ర కూచిపూడి, భరతనాట్యం, జానపదం నేర్పుతూ చిన్నారులను మరింత ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-ఏర్గట్ల

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఏర్గట్ల మండలకేంద్రంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లీం సహెూదరులకు ఆదివారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్ మాట్లాడుతూ... మత సామరస్యానికి ప్రతీకగా ఏర్గట్ల మండల కేంద్రంలో ప్రతి సంవత్సరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ పార్టీని నిర్వహిస్తామని, అందులో భాగంగానే ఇఫ్తార్ విందును నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు, నాయకులు

పసుపు క్వింటాల్‌కు రూ.15 వేల ధరతో కొనుగోలు చేయాలి

- చెరుకు ఫ్యాక్టరిని ప్రభుత్వమే తెరిపించాలి
- ఏఐకెఎంఎస్ డిమాండ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పసుపు క్వింటాల్కు 15 వేల రూపాయల ధరతో కొనుగోలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్)డిమాండ్ చేసింది.ఆదివారం మండలంలోని మెంట్రాజ్ పల్లి గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ పసుపు రైతులు పక్షం రోజులుగా మార్కెట్లోకి పసుపును తెచ్చి అమ్ముకుందామంటే తగిన ధరలు రాక ఆందోళన చెందుతున్నారని అన్నారు. మార్కెట్లో మధ్య దళారీలు, వ్యాపారస్తులు సిండికేట్గా మారి ధరలను తగ్గించి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని చెప్పారు.

పసుపు పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రాక రైతులు అల్లాడుతున్నారని, మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్ ధరలు ఇక్కడ రైతులకు రావడం లేదన్నారు. అధికారులు సైతం రైతులు వ్యాపారుల మోసాలకు గురికాకుండా చూడడంలో విఫలమవుతున్నారని పేర్కొన్నారు. గతంలో క్వింటాలు పసుపునకు రూ.16వేల వరకు ధరలు చెల్లించిన వ్యాపారస్తులు నేడు ఎనిమిది వేల నుండి తొమ్మిది వేల వరకు ధరలు పెట్టడం లేదని అన్నారు. దీనంతటికీ ప్రధానంగా మార్కెట్లో వ్యాపారస్తులు సిండికేట్గా మారి ధరలు తగ్గిస్తున్నారని వారన్నారు. రైతులకు పెట్టిన పెట్టుబడులు రాలేక అప్పుల పాలవుతున్నారని, పసుపు క్వింటాల్కు 15 వేల ధర చెల్లించాలని, రైతుల వద్ద ఉన్న పసుపును వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశఉ. రోజుల కొద్దీ మార్కెట్లో కుప్పలు పోసుకొని ఎదురుచూస్తున్నారని వరి ధాన్యం మాదిరిగానే పసుపు క్వింటాల్‌కు 1000 రూపాయల బోనస్ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులను నిలువునా ముంచుతున్న వ్యాపారస్తులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్‌లో గల చక్కెర ఫ్యాక్టరీ ని ప్రభుత్వంమే తెరిపించి నడిపించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవస్వామి, జెపి గంగాధర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | మార్చి 17, 2025 | www.navatelangana.com

పెద్దమ్మ ఆలయ రజతోత్సవ వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-తాడ్వాయి

ముదిరాజ్ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో పెద్దమ్మ 25 సంవత్సరాల రజతోత్సవ వేడుకలను తాడ్వాయిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. శబరీమాత ఆలయ సమీపంలో గల పెద్దమ్మ ఆలయంలో ఉదయం 11 గంటలకు పెద్దమ్మ పెద్దరాజుల కళ్యాణ వేద పండితులతో జరిపారు. అనంతరం ఓడిబియ్యం సమర్పించారు. దేవతల విగ్రహాలను అలంకరించిన వాహనంలో డప్పు సప్పులతో భక్తి పాటలతో ఊరేగింపు చేశారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు ఆలయ సమీపంలో అన్నప్రసాద సౌకర్యం ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు పంబల సదాశివుడు, తంబళ్ల సతీష్, పంబల్ల పాండరి, పని వెంకటి, పని పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని యాచారం తండాలో లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను సదాశివనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగ్యానాయక్ ఆదివారం పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల ప్రెసిడెంట్ గణేష్ నాయక్, మాజీ సర్పంచ్ సాజ్య నాయక్, లక్ష్మినాయక్ తండా పార్టీ అధ్యక్షులు నౌసి నాయక్, యాచారం పార్టీ ప్రెసిడెంట్ మోహన్ సింగ్ నాయక్, పుర్య నాయక్ తండా పార్టీ ప్రెసిడెంట్ పరశురామ్ నాయక్, సీనియర్ నాయకులు శంకర్ నాయక్, విఠల్ నాయక్, మోహన్ సింగ్ నాయక్, లాల్సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ..?

పిట్లంలో పూర్తికాని సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు

- ధ్వంసమైన డ్రయినేజీ వ్యవస్థ
- నిత్యం వెదజల్లుతున్న దుర్గంధం
- మొరం, కంకర వేసి వదిలేసిన వైనం
- ఎగిసిపడుతున్న దుమ్ము, ధూళీ
- అవస్థలు పడుతున్న వ్యాపారులు, ప్రజలు

పిట్లం మండల కేంద్రంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సాయిబాబా ఆలయం నుంచి హెచ్‌పీ పెట్రోల్ పంపు (నేషనల్ హైవేకు కలుపుతూ) సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులను గత ఆరు ఏడు నెలల క్రితం రూ.25 కోట్ల వ్యయంతో ప్రారంభించారు. మొరం, కంకర వేసి రెండు నెలలు కావొస్తున్నా పనుల్లో పురోగతి లేదు. పనుల్లో భాగంగా పలు దుకాణాల ముందు ఉన్న డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. డ్రయినేజీని దాటి దుకాణాలను వెళ్లాలంటేనే ప్రజలు జంకాల్సిన పరిస్థితి నెలకొంది.


దుకాణ సముదాయం ముందు నుంచి ప్రవహిస్తున్న మురికి నీరు

నవతెలంగాణ-పిట్లం

పిట్లం మండల కేంద్రంలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని ప్రధాన రహదారిని సెంట్రల్ లైటింగ్ నిర్మాణం చేయాలన్న సదుద్దేశంతో గత బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే రూ.25 కోట్ల వ్యయంతో నామమాత్రంగా పనులను ప్రారంభించారు. నిర్మాణ పనులు పూర్తి చేయకుండానే విఫలమయ్యారు. ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు చొరవతో సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులను ఎట్టకేలకు ప్రారంభించారు. సదరు కాంట్రాక్టర్ జెసిబి, ట్రాక్టర్ల సహాయంతో రహదారి కిరువైపులా డ్రైనేజీ నిర్మాణం నిమిత్తం తవ్వించి పనులు ప్రారంభించారు. రహదారి కిరువైపులా కంకరతో రోడ్డును చదును చేసి వదిలి వేయడంతో దుకాణదారులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చివరకు చిరు వ్యాపారులు వారి వారి కోక స్థలాలను వదిలి రోడ్డుపైనే వ్యాపారం చేయడం, క్షణక్షణం బస్సుల రాకపోకలు, ద్విచక్ర వాహనాలతో కిక్కిరిసిన రోడ్డుపై జనం ఎటు వెళ్లాలో అనే సందిగ్ధంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుకాణ సముదాయం ముందు గల డ్రైనేజీ నుంచి మురికి నీరు ప్రవహించడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దుర్గంధ భరితమైన వాసన తట్టుకోలేకపోతున్నామని, తాము వ్యాపారం ఎలా కొనసాగించాలని ఆందోళన చెందుతున్నారు. డ్రయినేజీ మొత్తం ధ్వంసమవడంతో అవసరాల నిమిత్తం దుకాణాలను వెళ్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదిఏమైనప్పటికీ ప్రభుత్వం వెంటనే స్పందించి సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులను పూర్తిచేయాలని మండలవాసుల కోరుతున్నారు.


కంకర వేసి వదిలివేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

పనులను వెంటనే పూర్తిచేయాలి

మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై నిర్మాణం చేపడుతున్న సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేయాలి. రోడ్డుకు ఇరువైపులా కంకర వేసి వదిలి వేయడంతో దుమ్ము ధూళితో అవస్థలకు గురవుతున్నాం. రోడ్డు కిరువైపులా ట్రాక్టర్, జెసిబి సహాయంతో తవ్వడం వల్ల మిగిలి ఉన్న రోడ్డుపై నడవలేక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకుగానూ సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి.

- బొమ్మల దేవేందర్, ద్విచక్ర వాహనాల, టైర్ల దుకాణ యజమాని

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లకు సన్మానం


ప్లీడర్‌ను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

సహ చట్ట మహిళ కార్యకర్త షబానా బేగం కామారెడ్డి జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియామకం కావడంతో ఆమెను ఆదివారం సమాచార హక్కు చట్టం కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. జిల్లాలో సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీలో మహిళా అధ్యక్షురాలుగా ఉంటూ న్యాయవాదిగా ఉన్నటువంటి షబానా బేగంను తెలంగాణ ప్రభుత్వం కామారెడ్డి జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ఏజీపీగా నియమించింది. గత కొంతకాలంగా సమాచార హక్కు చట్టం 2005పైన అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సామాజిక కార్యకర్తగా ఎదిగిన షబానా బేగంను సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ సభ్యులు రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ జోనల్ అధ్యక్షులు సిర్నాపల్లి ప్రదీప్ కుమార్, జిల్లా అధ్యక్షులు శివపూజ లింబయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంవీ భాస్కర్, జిల్లా మహిళా కార్యదర్శి సట్ల జమున, కార్యదర్శి అస్మ నాగిన్, కామారెడ్డి పట్టణ కార్యదర్శి జే.శ్రీనివాస్, అన్వర్ గౌరీ, తదితరులు పాల్గొన్నారు.

అలీసాగర్ వద్ద 'మడ్‌బాత్'


ఒంటికి మట్టి పూసుకున్న పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని తానాకలాన్ అలీసాగర్ వద్ద పతాంజలి యోగ కేంద్రం తానాకలాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7 గంటలకు అలీసాగర్ బోటింగ్ పాయింట్ వద్ద యోగ రత్న ఎత్తొండ ప్రభాకర్, కిషన్‌జి ఆధ్వర్యంలో మట్టి స్నానాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్‌లో గల అన్ని యోగ సెంటర్ల యోగా గురువులు, సాధకులు అలాగే నవీపేట్, నందిపేట్, ఆర్మూర్, బోధన్, ఎడపల్లి, మోస్రా, బాన్సువాడ, ఏరియా ప్రాంతాల యోగా సెంటర్ల నుంచి సుమారు 400 మంది యోగ సాధకులు వచ్చారు. ఇందులో పుట్ట మట్టి, ఆవు పేడ, ఆవు పాలు, ఆవు పెరుగు, అలాగే ఉత్తరేణి, గుంట కరగడ, తులసి, వేప, తంగిడి, కలబంద, ఇలా ఎన్నో రకాల మూలికలను కలిపి మట్టి ఒంటికి పూసుకొని గంటసేపు ఎండలో నిలబడి స్నానం చేశారు. ఈ మట్టి స్నానం వల్ల అనేక రకమైన చర్మవ్యాధులు గజ్జి, తామర, సోరియాసిస్, చికెన్ పప్స్, పూత, చుండ్రు, ఇలా ఎన్నో చర్మ వ్యాధులు నయమవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో యోగ రత్న ఎత్తుండ ప్రభాకర్, కిషన్‌జి, యోగ గురువులు సుర కిరణ్, ఆంజనేయులు, భూమాగౌడ్, సంతోష్, ఇరిగేషన్ డీఈ, లోక్య నాయక్, ఆకుల సురేష్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల జీవన భృతి కోసం బడ్జెట్ కేటాయించాలి

నవతెలంగాణ-కామారెడ్డి

బడ్జెట్‌లో బీడీ కార్మికులకు రూ.4016 జీవన భృతికై తగిన బడ్జెట్ కేటాయించాలని తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు యస్.సిద్దిరాములు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ కార్మికులకు, ప్యాకర్లకు, బట్టి చాటన్, తదితరులకు గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఈ నెల 19న జరిగే అసెంబ్లీ సమావేశంలో తగినంత బడ్జెట్ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీడీ కార్మికులకు విధించిన 2014 కటాఫ్ తేదీని తొలగించి, ఎలాంటి షరతులు లేకుండా రూ.4016 జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 14 నెలలు గడిచినా.. బీడీ కార్మికులకు ఇచ్చిన హామీ నేటికి అమలు చేయలేదని తెలిపారు. ఇచ్చిన హామీ అమలు చేయాలని గత నెలల నుంచి తెలంగాణ బహుళజన బీడీ కార్మిక సంఘం బిఎల్‌టీయూ, ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందన్నారు. బిజెపి ఎమ్మెల్యే అసెంబ్లీలో బీడీ కార్మికుల జీవన భృతి విషయం మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి బీడీ పరిశ్రమలో పని చేసే కార్మికులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రూ.4016 జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎమ్మెల్యే, అధికార పార్టీ నాయకులను గ్రామాల్లో తిరుగనివ్వమని హెచ్చరించారు.

బహుజన రాజ్యాధికారమే కాన్షీరామ్‌కు నివాళి

కాన్షీరాం 91వ జయంతి వేడుకల్లో పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ధర్మ సమాజ్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మహిపాల్‌ఆధ్వర్యంలో రాజ్యాధికార చిహ్నం కాన్షీరాం 91వ జయంతి వేడుకలు ఆదివారం నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గ్రామం లో నిర్వహించారు. బహుజన యుద్ధ వీరుడు మాన్యశ్రీ కాన్షీరాం 91వ జయంతి కార్యక్రమనికి ముఖ్య అతిథిగా డిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి సుమన్ మహారాజ్ మాట్లాడుతూ.. అట్టడుగు అణగారిన వర్గాలకు రాజ్యాధికారం అందించిన మహా నాయకుడు అని కాన్షీరాం అని అన్నారు. తెలంగాణలో బహుజన రాజ్యాధికారం సాధించడమే కాన్షీరాంకి ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. ధర్మ సమాజ్ పార్టీ 2వ వార్షికోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ప్రేమ్, జిల్లా నాయకులు ప్రశాంత్, మురళి, రమేష్, అన్ని మండలాల అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పనిచేయని సీసీ కెమెరాలు.. పక్కనపెట్టిన సిబ్బంది



సీసీ నిరుపయోగంగా మారిన రాడ్‌లు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గతంలో వీడీసీ ఆధ్వర్యంలో 4సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. 2సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో మరమ్మతుల కోసం తొలగించి పక్కన పెట్టేశారు. మండల కేంద్రం నుంచి మహారాష్ట్రకు వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. ఈ పరిస్థితుల్లో సీసీ కెమెరాలు లేకపోవడం వలన ఏదైనా ఘటనలు జరిగే అవకాశం ఉంది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్‌ను వివరణ కోరగా సీసీ కెమెరాలు పాడవడంతో వాటిని తొలగించి గ్రామ పంచాయతీలో భద్రపరిచినట్టు తెలిపారు. ఆర్థిక భారంతో వాటిని బిగించడం లేదని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు పోలింగ్ బూత్‌లు సిద్ధం



మండలంలోని ఓ గ్రామంలో రాసిన పోలింగ్ బూత్ సంఖ్య

నవతెలంగాణ-బోధన్

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ సర్వం సిద్ధం చేసింది. గత రెండు నెలల క్రితం ఎన్నికల నిర్వహణకు ఉద్యోగులకు శిక్షణ పూర్తి చేశారు. ఎన్నికల సామగ్రి సైతం ఆయా మండలాలకు అందించినట్టు సమాచారం. ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ బూత్‌లను సిద్ధం చేశారు. బోధన్ మండలంలో 64, సాలూర మండలంలో 33 పోలింగ్ బూత్‌లను సిద్ధంచేసి బూత్‌ల సంఖ్యలను సైతం రాయించారు. దాంతో ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉందని, ప్రభుత్వ నిర్ణయమే తరువాయి అన్నట్లు ఉంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిపి గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1985-1986 సంవత్సర పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం శాంభవి హైస్కూలులో ఘనంగా నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు దాదాపు 40 వసంతాల తర్వాత కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు తమ మనోగతం, ఉపన్యాసాలు ఇచ్చారు. విద్యార్థి దశ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. గురువుల నేర్పిన విద్యాబుద్ధులతో జీవితంలో మంచి స్థాయిలో స్థిరపడ్డామని, గురువుల స్థానం గొప్పదని కొనియాడారు.కార్యక్రమములో భాగంగా ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు
- సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పలువురు నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే తోటా లక్ష్మికాంతారావు అన్నారు. మండల కేంద్రంలో రూ.50 లక్షల నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే రథం గల్లీలో సీసీ రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యంగా మద్నూర్ మండల కేంద్రానికి భారీగా నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. మద్నూర్ మండల కేంద్రానికి భారీ మొత్తంలో నిధులు మంజూరు చేసినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యే సన్నిహితులు సాయిపటేల్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు ధరాస్ సాయిలు, సీనియర్ నాయకులు చౌళవార్ హనుమాన్లు, మద్నూర్ సింగిల్విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుటుంబ సభ్యులు రమేష్, వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, పంచాయతీరాజ్ ఏఈ, పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు..

మండల కేంద్రంలోని రథంగల్లి శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయాన్ని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. లక్ష్మీనారాయణ ఆలయానికి రూ. 25 లక్షల నిధులు ఎమ్మెల్యే మంజూరు చేయడం పట్ల ఆలయ కమిటీ, గల్లి ప్రజలు గ్రామస్తులు ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కమిటీ సభ్యులు, గల్లి పెద్దలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-గాంధారి

అసెంబ్లీలో దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, అలాగే ఆయనకు మద్దతు తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు కేటీఆర్ శాసనసభ్యత్వాన్ని రద్దుచేసి చట్ట పరంగా వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గాంధారి మండల కేంద్రంలోని నెహ్రూ విగ్రహం దగ్గర కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జగదీశ్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తూర్పు రాజులు మాట్లాడుతూ.. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానన్న దళితులకు మూడెకరాల భూమి ఇస్తానన్న కేసీఆర్ ఏం చేశాడని, దళితులకు పదవులు ఇస్తే బీఆర్ఎస్ పార్టీ తట్టుకోలేకపోతుందని.. అధికారం కోల్పోవడంతో బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. ఇకనైనా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా మెదులుకోవాలని ఆయన బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి లైన్ రమేష్, ఏఎంసి డైరెక్టర్ బొమ్మని బాలయ్య, సొసైటీ డైరెక్టర్ గన్న లక్ష్మణ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీసా గణేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంఘని బాబా, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘని బాలయ్య, గడ శంకర్, నీల రవి, హైమద్, ఈశ్వర్ గౌడ్, గణేష్ నాయక్, పత్తి కుమార్, సాయిలు, వినయ్, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ నిరవధిక దీక్షలు


పోతంగల్ : దీక్షలో పాల్గొన్న నాయకులు


నవతెలంగాణ-పోతంగల్/ఎడపల్లి

మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో రిలే నిరవధిక దీక్షలు ఏడవ రోజు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేసి చూపిస్తామని నిండు అసెంబ్లీలో దేశంలోనే మొట్ట మొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేసి చూపిస్తానని మాదిగలకు మాట ఇచ్చారని, ఆ మాటకు కట్టుబడి ఉండాలని అన్నారు. ఈ నెల 17వ తేదీలోపు ఎస్సీ వర్గీకరణ, ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయొద్దని, ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీలో ఉప వర్గీకరణ చట్టబద్ధత బిల్లు కల్పించిన తర్వాతనే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని అన్నారు. అలాగే మాదిగ ఎమ్మెల్యేలకు ఇద్దరికి మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాదిగల జనాభా దామాషా ప్రకారం 11 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మాదిగలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షులు ఎర్రోళ్ల యాదవరావు, మండల ఎంఎస్పి అధ్యక్షులు నక్కెవర సాయిలు, ఉపాధ్యక్షులు కర్రెల్ల సాయిలు, మండల ప్రధాన కార్యదర్శి సంగయ్య, మండల సహాయ కార్యదర్శి మేత్రి లాలయ్య, గాయక్వాడ్ సంతోష్, చేతననగర్ గ్రామ అధ్యక్షులు సంజీవ్, హంగర్గా అధ్యక్షులు మస్నాజీ, విట్టల్, బాలయ్య కోడిచర్ల సురేష్, పోతంగల్ శ్రీనివాస్, భూమయ్య శంకర్య, క్యయ్య, ఉప సర్పంచ్ చేతన నగర్ నర్సింలు, రాజు, సాయికుమార్ పాల్గొన్నారు.

నాలుగో రోజుకు ఎమ్మార్పీఎస్ దీక్షలు

ఎడపల్లి : మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ పోరాటమే లక్ష్యంగా నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ఎమ్మార్పీఎస్ బోధన్ నియోజకవర్గ నాయకులు లసిన్‌గారి భూమయ్య తెలిపారు. దీక్షలో కూర్చున్న వారికి ఆయన మద్దతు తెలిపారు. వర్గీకరణ సాధించే వరకూ తమ పోరాటం ఆగదని ఆయన ప్రభుత్వాలను హెచ్చరించారు. దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు మహిళలు కూర్చున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన అనిల్ ను ఆదివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ అనిల్ ప్రస్తుతం ఇంటి వద్ద కోలుకుంటున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఆయనను పరామర్శించి ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నరసయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.